ఈనాడు
తూర్పుగోదావరి
గురువారం అక్టోబరు 17, 2024

గోదారమ్మకు పున్నమి హారతి



వేదపండితుల మంత్రోచ్చారణలతో గోదారమ్మకు పున్నమి వేళలో 14 రకాల హారతులను సమర్పించారు. రాజమహేంద్రవరంలోని పుష్కర ఘాట్‌లో నిర్వహిస్తున్న నిత్యహారతి కార్యక్రమంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం సాయంత్రం గోదావరిమాత విగ్రహం వద్ద విశేష పూజలు నిర్వహించారు. నగరవాసులు పెద్ద సంఖ్యలో హాజరై హారతి ఘట్టాన్ని తిలకించారు.

- న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

ఇసుక.. మరో 10 రోజులు ఆగాల్సిందే

నదీ ప్రవాహంతో తవ్వకాలకు ప్రతిబంధకాలు

ఈనాడు, రాజమహేంద్రవరం: రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి నదుల్లోని ఓపెన్ రీచ్‌లలో ఇసుక తవ్వకాలు ఆరంభమైనప్పటికీ ఉమ్మడి జిల్లాలో మాత్రం ప్రతిబంధకాలు తప్పలేదు. రీచ్‌లు గుర్తించిన ప్రాంతాల్లో గోదావరి నదీ ప్రవాహం అధికంగా ఉండడం.. మనుషులతో తవ్వి, తరలించే పరిస్థితులు లేకపోవడమే దీనికి కారణం. ప్రస్తుతం తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల పరిధిలో 28 రీచ్‌ల్లో తవ్వకాలకు అనుమతులు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు 19 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉంటుందని అంచనా. తవ్వకాలకు మరో పది రోజులు సమయం పట్టే అవకాశముంది.



మూడుచోట్ల ఆగిన టెండర్లు

■ తూర్పులో ఇటీవల 17 రీచ్‌లకు టెండర్లు పిలవగా సరిహద్దు సమస్యతో ఒకటి, సాంకేతిక కారణాలతో రెండుచోట్ల మినహా మిగతాచోట్ల ప్రక్రియ పూర్తిచేశారు. వేమగిరి, వానపల్లి-1, 2, ములకల్లంక, కాటవరం-1, ముక్కామల, కాకరపర్రు, తీపర్రు-2, 3, పెండ్యాల-కానూరు, పందలపర్రు, జీడిగుంట, చిడిపి, కుమారదేవం-1, 2, 3, వేగేశ్వరపురం రీచ్‌లను తవ్వకాలకు ఖరారు చేశారు. వీటి ద్వారా రోజుకు 12 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక సేకరణ చేయొచ్చు. ■ ఈ జిల్లా పరిధిలోని 9 రీచ్‌ల్లో బోట్స్‌మెన్ సొసైటీల ఆధ్వర్యంలో తవ్వకాలు చేస్తుండగా రోజుకు 13 వేల మెట్రిక్ టన్నులు వస్తోంది. ఇది సరిపోవడం లేదు. పెండ్యాల నిల్వకేంద్రంలో 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉంది.

కోనసీమలో 12 రీచ్‌లు..

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 12 రీచ్‌ల్లో తవ్వకాలకు అనుమతులు ఉన్నాయి. పులిదిండి, నార్కేడుమిల్లి, వడ్డిపర్రు-1, 2, అంకంపాలెం, పొడగట్లపల్లి -1, 2, ఆత్రేయపురం, ఊబలంక-1, కపిలేశ్వరపురం, ఆలమూరు, తాతపూడిలో ఈ రీచ్‌లు ఉన్నాయి. వీటి ద్వారా నిత్యం 7 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక సేకరణ చేయొచ్చని అంచనా. జలతాకిడితో తవ్వకాలు ప్రారంభంకాలేదని, ఈ నెలాఖరులోగా మొదలయ్యే అవకాశముందని అధికారులు తెలిపారు. ■ పొడగట్లపల్లి, అంకంపాలెంలో 5 హెక్టార్లకు పైబడిన విస్తీర్ణంలో సెమీ మెకనైజ్డ్ విధానంలో ఇసుక తవ్వకాలకు ఇటీవల ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. స్థానికుల నుంచి సమ్మతి రావడంతో ఆ నివేదికను ఎస్ఈఐఏఏకు పంపించారు. అటునుంచి నిరభ్యంతర ధ్రువీకరణ వచ్చింది. పర్యావరణ అనుమతులతో పాటు సీఎఫ్ఈ, సీఎఫ్‌వో సమ్మతి కోసం రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు చేస్తే గరిష్ఠంగా నెల రోజుల్లో ఈ రెండుచోట్ల రీచ్‌లు అందుబాటులోకి రావొచ్చు.

అక్రమాలపై.. సాంకేతిక అస్త్రం

- పీఏసీఎస్‌ల ప్రక్షాళనకు చర్యలు
- 298 కేంద్రాల కంప్యూటరీకరణకు కసరత్తు

బినామీలు, తప్పుడు పత్రాలతో రుణాలు.. వందల కోట్ల కుంభకోణాలు.. లెక్కలేనన్ని తప్పులు..ఇదీ ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) పరిస్థితి. కంప్యూటర్ యుగంలోనూ ఆర్థిక లావాదేవీలన్నీ కాగితాల రూపంలో జరగడమే కారణం.. దీంతో పీఏసీఎస్‌ల ప్రక్షాళనకు కేంద్రం ఉపక్రమించింది. కంప్యూటరీకరణ ద్వారా వ్యవస్థలను అనుసంధానం చేసి.. పత్రరహిత పాలనతో అక్రమాలకు అడ్డకట్ట వేయనుంది.


కాకినాడలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ (డీసీసీబీ) పరిధిలోని 52 శాఖల్లో సాంకేతికతతో ఆర్థిక లావాదేవీలు సాగుతున్నాయి. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి జిల్లాల్లోని 298 పీఏసీఎస్‌లలో నేటికీ లావాదేవీలు, రుణాల వివరాలు కాగితాల రూపంలోనే భద్రపరుస్తున్నారు. రాష్ట్ర, జిల్లా సహకార బ్యాంకులతో పీఏసీఎస్‌లు అనుసంధానం కాక.. రోజువారీ వ్యవహారాలపై పర్యవేక్షణ కష్టమవుతోంది. దీంతో తప్పుడు పత్రాలు జతచేసి రుణాలు పొందడం వంటి అక్రమాలు జరిగాయి.

ఇప్పటికీ కాగితాల రూపంలోనే..

◆ ఉమ్మడి జిల్లాలో 148 పీఏసీఎస్‌లు నష్టాల్లో ఉన్నాయి. రూ.949.98 కోట్ల రుణాలు గడువు మీరినా చెల్లించని పరిస్థితి నెలకొంది. ఈ ప్రభావం డీసీసీబీపై పడింది. గత ఆర్థిక సంవత్సరానికి రూ.248.26 కోట్ల నష్టాన్ని చవిచూసింది. పరిస్థితి చక్కదిద్దేందుకు ప్రభుత్వం నుంచి రూ.300 కోట్లు, నాబార్డు నుంచి 3 శాతం వడ్డీకి రూ.500 కోట్ల రుణాన్ని డీసీసీబీ కోరింది. 2029 నాటికి వ్యవస్థను లాభాల్లోకి తెచ్చేలా ప్రణాళిక రూపొందించింది.



అమలాపురం: రోళ్లపాలెం పీఏసీఎస్‌లో కంప్యూటరీకరణ పనులు



● పైలట్ ప్రాజెక్టు కింద..

ఈనాడు, కాకినాడ

కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ పీఏసీఎస్‌లను నాబార్డు సాఫ్ట్‌వేర్ ద్వారా డీసీసీబీలకు జాతీయ నెట్‌వర్క్‌తో అనుసంధానానికి చర్యలు చేపట్టింది. పైలట్ ప్రాజెక్టు కింద కాకినాడ జిల్లాలో నరవ, గొల్లప్రోలు.. కోనసీమలో వీరవల్లిపాలెం, అమలాపురంలోని కేవీరావు పీఏసీఎస్, తూర్పులో తొర్రేడు.. అల్లూరి జిల్లాలో ఇందుకూరుపేట పీఎస్‌సీఎస్‌లను ఎంపికచేసినా ఏవీ కొలిక్కిరాలేదు. వీటితోపాటు అన్ని సంఘాల కంప్యూటరీకరణను మరో 15 రోజుల్లో పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నారు.

ఆన్‌లైన్‌లోనే తనిఖీ చేయొచ్చు



పీఏసీఎస్‌లలో పత్ర రహిత సేవలతో.. అక్రమాలకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. సాంకేతికతతో పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణ పెరుగుతుంది. ఏరోజుకారోజు లావాదేవీలు ఆన్‌లైన్‌లోనే తనిఖీ చేసి పరిస్థితి సమీక్షించొచ్చు. పీఏసీఎస్‌లకు కంప్యూటర్, 13 రకాల పరికరాలు పంపిణీ చేశారు. ఉమ్మడి జిల్లాలో డేటా ఎంట్రీ 70 శాతం పూర్తయింది. కంప్యూటరీకరణ నెలాఖరుకు కొలిక్కివస్తుంది.

-ఆర్.వి.నరసింహారావు, సీఈవో, డీసీసీబీ

జగన్ గ్యాంగ్‌పై చర్యలు తప్పవు

వ్యాఖ్యాతపై జరిగిన దాడిపై స్పందించిన మంత్రి లోకేశ్



టి.నగర్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్‌ను ఆదర్శంగా తీసుకొని ఆ పార్టీ నేతలు రెచ్చిపోతున్నారని మంత్రి లోకేశ్ అన్నారు. ఇటీవల రాజమహేంద్రవరంలో ఈవెంటు వ్యాఖ్యాత కావ్యశ్రీపై వైకాపా నేత దాడికి పాల్పడిన ఘటనపై ఆయన స్పందించారు. ఈ మేరకు బుధవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. అధికారం పోయినా అరాచకాలు మాత్రం తగ్గలేదన్నారు. పెద్ద సైకో జగన్ ఫ్యాక్షన్ పాలనలో నేరాలు అలవాటైన పిల్ల సైకోలు చెలరేగిపోతున్నారన్నారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ అండతో వైకాపా నాయకుడు కావ్య, ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేశారన్నారు. మహిళపై దాడి చేసిన జగన్ గ్యాంగ్‌పై చర్యలు తప్పవన్నారు.

నయా కిక్కు

- ■ తెరుచుకున్న మద్యం దుకాణాలు
- ■ ఉమ్మడి జిల్లాలో రూ.27.80 కోట్ల సరకు విక్రయాలు



ఈనాడు, రాజమహేంద్రవరం: ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం విధానం ప్రకారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లైసెన్సులు దక్కించుకున్నవారంతా బుధవారం నుంచి దుకాణాలను ప్రారంభించారు. తమకు అవసరమైన సరకును నిర్దేశిత ఐఎంఎల్ డిపోల నుంచి తీసుకువచ్చారు. 375 దుకాణాల నుంచి వచ్చిన ఇండెంట్ల ఆధారంగా రాజమహేంద్రవరం, సామర్లకోట, అమలాపురం, చాగల్లులోని డిపోల నుంచి సుమారు రూ.27.80 కోట్ల విలువైన మద్యం సరఫరా చేశారు. అందుబాటులో ఉన్న నిల్వలు, గిరాకీ ఆధారంగా దాదాపు 40 వేల కేసుల మద్యం (కేసుకు 9 లీటర్లు) అందించారు. కొన్ని ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటు ప్రక్రియ పూర్తికాకపోవడంతో షామియానాలు ఏర్పాటుచేశారు.

రద్దీ వాతావరణం..

● రాజమహేంద్రవరంలోని ఐఎంఎల్ డిపో నుంచి బుధవారం 74 దుకాణాలకు రూ.6.73 కోట్ల (లిక్కరు 7393, బీర్లు 2164 కేసులు) విలువైన మద్యం సరఫరా చేశారు. ఇక్కడి నుంచే కోనసీమ జిల్లా పరిధిలోని 42 దుకాణాలకు సైతం పంపిస్తున్నారు. ● చాగల్లు డిపో పరిధిలో తూర్పుగోదావరి జిల్లాలో 42, ఏలూరు-28, భీమవరానికి చెందిన 40 దుకాణాలున్నాయి. ఇక్కడి నుంచి బుధవారం రాత్రి 9 గంటల వరకు 96 దుకాణాలకు రూ.4.20 కోట్ల విలువైన మద్యం కేసులు సరఫరా చేశారు. ● కాకినాడ జిల్లా పరిధిలో 155 దుకాణాలుండగా 118 దుకాణాలకు రూ.11.28 కోట్ల (లిక్కరు 11,797, బీర్లు 5458 కేసులు) విలువైన మద్యం పంపించారు. ● అమలాపురం డిపో పరిధిలో 92 దుకాణాలుండగా 72 దుకాణాలకు రూ.5.6 కోట్ల (లిక్కరు 6056, బీర్లు 1956 కేసులు) విలువైన మద్యం విక్రయించారు. సాంకేతిక సమస్య కారణంగా అందరికీ సరకు సరఫరా చేసేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ● కొన్ని దుకాణాల్లో గత ప్రభుత్వానికి చెందిన బ్రాండ్లను రూ.150 నుంచి రూ.220 చొప్పున విక్రయించడంపై కొందరు ప్రశ్నించారు. మద్యం డిపోల్లో ఇప్పటికీ పాత స్టాకు ఉండడం, కొత్త బ్రాండ్లు కూడా రావడంతో ఇలా జరిగి ఉంటుందని ఓ అధికారి తెలిపారు.

రైతన్నకు రాయితీపై పరికరాలు

రైతులకు రాయితీపై యంత్రపరికరాలు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. జిల్లా పరిధిలోని ఏఏ యంత్ర పరికరాలు ఏ మేరకు అవసరమవుతాయో పరిశీలించి అధికారులు ప్రతిపాదనలు పంపారు. వాటిని రాయితీపై అందజేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు.

- న్యూస్‌టుడే, తాళ్లపూడి



బ్యాటరీ స్ప్రేయర్లతో పురుగు మందు పిచికారీ (పాత చిత్రం)

సాగుకు అవసరమయ్యే యంత్రపరికరాలు అందుబాటులో లేక, ప్రభుత్వం రాయితీపై అందించక జిల్లాలో రైతులు అయిదేళ్లపాటు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతంలోనూ తెదేపా ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే యంత్ర పరికరాలను రాయితీపై సమకూర్చింది. ఈ విధానానికి వైకాపా ప్రభుత్వం మంగళం పాడేసింది. ఆర్బీకేల పరిధిలో గ్రూపులు ఏర్పాటైన వారికి మాత్రమే యంత్రాలను ఇచ్చి వారి వద్ద నుంచి మిగిలిన రైతులు అద్దెకు తీసుకోవాలని నిర్దేశించింది. అవి కూడా భారీ యంత్రాలే. బ్యాటరీ స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజన్లు, బరకాలు తదితర చిన్నచిన్న వాటిని ఏకంగా ఎత్తేశారు. వీటిని మార్కెట్లో కొనుగోలు చేయలేక.. బాడుగా చెల్లించలేక రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు.

అవసరమైన పరికరాల జాబితా ఇలా..	
టార్పాలిన్లు	40,050
బ్యాటరీ స్ప్రేయర్లు	2763
పవర్‌స్ప్రేయర్లు	205
తైవాన్ స్ప్రేయర్లు	165
కల్టివేటర్లు	356
బండ్ ఫార్మర్	24
ఎంబీ ప్లవ్	123
ప్యాడీ థ్రెసర్	7
స్ట్రా బేలర్	67
పవర్‌వీడర్	73
బ్రష్‌కట్టర్	54
డిస్క్ ప్లో	112
మొక్కజొన్న షెల్లర్స్	27
దమ్ము యంత్రాలు	39
పవర్‌టిల్లర్లు	634
ట్రాక్టర్లు	530
రొటేటర్లు	637
ట్రాన్స్‌ప్లాంటర్	13
హార్వెస్టర్లు	77

19 రకాలు.. 45,956 పరికరాలు..

కూటమి ప్రభుత్వం రైతుకు అండగా ఉండేందుకు చర్యలు చేపట్టింది. మండలాల వారీగా ఏయే యంత్రాలు ఏ మేరకు అవసరమో వివరాలు సేకరించింది. దీని ప్రకారం 19 రకాల యంత్ర పరికరాలు సుమారు 45,956 అవసరమవుతాయని గుర్తించారు. ఈ సంఖ్య పెరిగినా అందరికీ ఇచ్చేందుకు చర్యలు చేపడతామని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు చెప్పారు.

ఉత్తుత్తి హెచ్చరిక.. ఆహారం బాగుపడక..!

- ■ శుచి, శుభ్రతకు దూరంగా పలు హోటళ్లు
- ■ మొక్కుబడి తనిఖీలతో నెట్టుకొస్తోన్న అధికారులు

న్యూస్‌టుడే, ధవళేశ్వరం

ఆహార నాణ్యత గాల్లో దీపంలా మారింది.. అధికారుల ప్రయత్నంలో చిత్తశుద్ధి కొరవడింది.. ఆకస్మిక తనిఖీలు, అపరాధ రుసుములు అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోతుండగా, రెస్టారెంట్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా నాసిరకాన్ని పెంచిపోషిస్తుండటం ఇబ్బందికరంగా మారింది. అడపాదడపా దాడులు, అంతంతమాత్రంగా కేసులతో లక్ష్యానికి గండిపడుతోంది.



రాజమహేంద్రవరంలో గడువుతీరిన తినుబండారాలను సీజ్ చేస్తున్న అధికారులు

వాస్తవానికి.. దుకాణం, హోటల్, రెస్టారెంట్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ఇలా ఏది ప్రారంభించాలన్నా, లైసెన్సులు తీసుకోవాల్సిందే. జిల్లాలో వెయ్యికి పైగా ఈ తరహాలో ఉండగా.. వీటిలో కొన్నింటికి మాత్రమే లైసెన్సులున్నాయి. తోపుడు బండ్లకైతే లెక్కేలేదు. సంవత్సరానికి రూ.12లక్షలు లోపు టర్నోవర్ ఉన్న తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు రూ.100, రూ.12 లక్షలు దాటి టర్నోవర్ కలిగిన ట్రేడర్స్, మార్కెటింగ్ వ్యాపారులు రూ.2 వేల నుంచి రూ.5 వేలు, రూ.20 కోట్ల టర్నోవర్ దాటితే రూ.7,500 పన్ను చెల్లించి సెంట్రల్ లైసెన్సు తీసుకోవాలి. ఈ నిబంధనల్లో చాలా వరకు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు.

యంత్రాంగం బలహీనం

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి లక్ష మందికి ఒకరు, పట్టణ ప్రాంతాలలో ప్రతి 50 వేల మంది జనాభాకు ఒక ఆహార భద్రతాధికారి ఉండాలి. ఈ లెక్కన జిల్లా కేంద్రంలోనే కనీసం ఆరుగురు అధికారులు అవసరం. అయితే కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలో ఇద్దరు అధికారులున్నారు. జిల్లా కార్యాలయంలో సహాయ సిబ్బంది కూడా లేకపోవడంతో రోజువారీ కార్యకలాపాలకే అధికారులు పరిమితమవుతున్నారు. దీంతో తనిఖీలు సక్రమంగా సాగడం లేదు.

జిల్లాలో 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు తనిఖీల వివరాలు పెండింగ్‌లో ఉన్న కేసులు	
తనిఖీలు	135
నమోదైన కేసులు	114
జేసీ కోర్టులో	60
న్యాయస్థానాలలో	04
అపరాధ రుసుము	50 కేసులకు రూ.3లక్షలు

■ కేసులు నమోదు చేస్తాం..

నిర్దేశించిన ప్రమాణాల మేరకు ఆహార పదార్థాలు విక్రయించాలి. నూనెలో టీపీసీ 25శాతం కంటే ఎక్కువ ఉంటే కేసులు నమోదు చేస్తాం. వంటకు వినియోగించే నూనెను రెండు సార్లు కంటే ఎక్కువ వాడకూడదు. దీనిని నియంత్రించేందుకు రుకోలో భాగంగా 300 మంది హోటల్ యజమానులకు శిక్షణ ఇచ్చాం. - రుక్మయ్య, జిల్లా ఆహార భద్రతా అధికారి

■ ఉదర సంబంధ వ్యాధుల ముప్పు

ఫాస్ట్‌ఫుడ్స్‌లో వాడే టేస్టింగ్ సాల్ట్ వల్ల ఉదర సంబంధ వ్యాధులు, పక్షవాతం, కడుపు ఉబ్బరం, అల్సర్, దీర్ఘకాలంలో అరుగుదల లేకపోవడం, చిన్నపేగు క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉంది. రెండుసార్లు మించి వేడిచేసిన నూనె కారణంగా చెడు కొలెస్ట్రాల్, ట్రాన్స్‌ఫ్యాట్స్ ఎక్కువై అనారోగ్య సమస్యలకు అవకాశం ఉంది. - డాక్టర్ సుధాకర్, పీహెచ్‌సీ, ధవళేశ్వరం

డెల్టాకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 6,800 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలకు 2000, 1800, 3000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. బ్యారేజీ వద్ద 10.90 అడుగుల నీటిమట్టం కొనసాగుతుందన్నారు. 58,846 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నట్లు తెలిపారు.



కలిసొచ్చిన దసరా

జిల్లా ఆర్టీసీకి రూ. 46.05 లక్షల అదనపు రాబడి

డిపో	బస్సుల సంఖ్య	కిలో మీటర్లు	ప్రయాణికులు	రాబడి (రూ.లలో)
రాజమహేంద్రవరం	100	52,799	6,079	21,18,741
గోకవరం	34	20,806	3,921	10,78,806
కొవ్వూరు	55	28,247	4,039	11,58,223
నిడదవోలు	13	8,095	1,281	2,50,038

డిపోల వారీగా తిప్పిన ప్రత్యేక బస్సు సర్వీసులు, ఆదాయం వివరాలు..

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం)

జిల్లా ఆర్టీసీకి ఈసారి దసరా పండగ సీజన్ కలిసొచ్చింది. గతేడాది దసరా సీజన్‌తో పోలిస్తే ఈసారి ఆదాయం పెరిగింది. జిల్లాలోని నాలుగు డిపోల నుంచి తిప్పిన ప్రత్యేక సర్వీసుల ద్వారా రూ.46.05 లక్షల అదనపు రాబడి సమకూరింది. పండగకు హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చి, పండగ అనంతరం మళ్లీ తిరిగి వెళ్లే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 8 నుంచి 15 వరకు జిల్లాలోని రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల నుంచి మొత్తం 202 ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపారు. ఇవి ఎనిమిది రోజులపాటు మొత్తం 1,09,947 కిలోమీటర్ల మేర తిరగ్గా.. 15,320 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. తద్వారా జిల్లా ఆర్టీసీకి రూ.46,05,808 అదనపు రాబడి సమకూరిందని అధికారులు తెలిపారు. అదే గతేడాది పండగ సీజన్‌లో రూ.45,42,978 అదనపు రాబడి వచ్చిందన్నారు. హైదరాబాద్ ప్రత్యేక సర్వీసుల ద్వారా రాజమహేంద్రవరం డిపోకి అత్యధికంగా రూ.21.18 లక్షల అదనపు రాబడి వచ్చింది. ఇదికాక ఇక్కడి ప్రధాన బస్టాండ్ నుంచి విశాఖపట్నానికి అదనపు సర్వీసులు నడపడం ద్వారా మరింత ఆదాయం సమకూరింది.



రాజమహేంద్రవరం ప్రధాన బస్టాండ్‌లో బస్సెక్కుతున్న ప్రయాణికులు

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఇసుక బుకింగ్‌కు ప్రత్యేక సిబ్బంది

రాజమహేంద్రవరం కలెక్టరేట్: వినియోగదారులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకునేందుకు వీలుగా ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. బుధవారం జేసీ చిన్నరాముడుతో కలిసి వీక్షణ సమావేశంలో ఇసుక సరఫరాపై క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. వినియోగదారులు ఇసుక ఆఫ్‌లైన్‌లో బుధవారం నుంచి ప్రారంభించినందున సిబ్బంది విధులు బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. ప్రతి ఇసుక పాయింట్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రీచ్‌ల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేసి, అవి ఉన్న వారినే అనుమతించాల్సి ఉంటుందన్నారు. ఇసుక రవాణాకు వినియోగదారుని ఐచ్ఛికాన్ని అనుసరించి సొంతంగా వాహనం ఏర్పాటు చేసుకునే సౌలభ్యం ఉందని, ట్రాన్స్‌పోర్టు కోసం బుక్ చేసుకున్న వారి ఫోన్ నంబరుకు ఓటీపీ వస్తుందని, దానిని నిర్ధారణ చేసుకున్న తర్వాతే లోడింగ్ పాయింట్ వద్దకు అనుమతించాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద స్లాట్ కేటాయింపులను అనుసరించి క్రమబద్ధీకరణ చర్యలు తీసుకోవాలని, పోలీసు పర్యవేక్షణ తప్పనిసరని అన్నారు.






ఊరేగింపులో అమ్మవారి రథం, దేవతా వేషధారణలు

స్వర్ణ కాంతుల్లో దుర్గమ్మ ఊరేగింపు

గోకవరం: శరన్నవరాత్రుల ముగింపును పురస్కరించుకొని గోకవరం దేవీచౌక్ దుర్గాదేవి అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి సేవకుల ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో బుధవారం సాయంత్రం నుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపులో పుష్పాలతో అలంకరించిన రథంపై అమ్మవారిని ఉంచి భక్తులు తాళ్లతో లాగుతూ భక్తి శ్రద్ధలతో ముందుకు కదిలారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎకో టూరిజం అభివృద్ధి అంశాలపై చర్చ



కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, నర్సరీ అసోసియేషన్ ప్రతినిధులతో చర్చిస్తున్న కలెక్టర్

రాజమహేంద్రవరం కలెక్టరేట్: ఎకో టూరిజం అభివృద్ధి అంశాలపై చర్చించేందుకు బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కడియం, వేమగిరికి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు, నర్సరీ అసోసియేషన్ ప్రతినిధులు, పర్యాటక శాఖ అధికారులతో కలెక్టర్ ప్రశాంతి సమావేశం నిర్వహించారు. పర్యాటకాభివృద్ధిలో భాగంగా వేమగిరి నుంచి పొట్టిలంక వరకు ఉన్న కెనాల్ బండ్ ప్రాంతంలో ఫ్లవర్ స్టాల్స్, ఫుడ్ స్టాల్స్, కెఫ్టేరియాల ఏర్పాటు చేసే క్రమంలో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రస్తుత పరిస్థితిపై నివేదికలు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎకో టూరిజం అభివృద్ధికి అధికారులు ప్రాథమికంగా గుర్తించిన అంశాల వివరాలతో కూడిన పీపీటీ ఇచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగా పర్యావరణానికి ఎటువంటి ఆటంకం లేకుండా జంగిల్ క్లియరెన్స్ చేపట్టి దుకాణాల ఏర్పాటు, కెఫ్టేరియా నిర్మాణాలు, స్వాగత, ముఖ ద్వారాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలో సూచిస్తూ సమగ్ర వివరాలు అందజేసినట్లు తెలిపారు. ఎవరికి ఎక్కడ షాపులు కేటాయించాలో నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇదే క్రమంలో నర్సరీలు ఉన్న ప్రాంతానికి అనుసంధానం చేస్తూ మూడు ప్రదేశాల్లో ఫుట్‌వే బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. దీనికి సంబంధిత నర్సరీ యాజమాన్యం అంగీకారం తెలియజేయాల్సి ఉంటుందన్నారు. కడియపులంక దిండి నర్సరీల్లో రెండు చోట్ల జీప్ రైడర్స్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు చేశామని, వాటిపై ఆయా నర్సరీ అసోసియేషన్‌లు చర్చించుకుని అంగీకారం తెలియజేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకుడు వి.స్వామినాయుడు, జిల్లా పర్యాటక అధికారి వెంకటాచలం, ఏపీఎంఐపీ పీడీ దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

2 మార్గాలు.. 4 వరుసలు

కాకినాడ-జొన్నాడ; కాకినాడ-ధవళేశ్వరం రహదారుల విస్తరణకు పచ్చజెండా



బిక్కవోలు-బలభద్రపురం మధ్య కెనాల్‌రోడ్డు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా పరిధిలో అత్యంత రద్దీగా ఉండే రెండు ప్రధాన రహదారుల విస్తరణకు అడుగులు పడనున్నాయి. కాకినాడ-జొన్నాడ, కాకినాడ-ధవళేశ్వరం కెనాల్‌రోడ్డు అభివృద్ధికి బాటలు వేయనున్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో 17 ప్రధాన రహదారులను ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) కింద బాగుచేయాలని సంకల్పించింది. అందులో ఈ రెండు రాష్ట్ర రహదారులకు చోటు కల్పించారు. వీటిని నాలుగు వరుసలుగా మార్చనున్నారు. కెనాల్ రోడ్డు విస్తరణకు భూసేకరణ పూర్తవగా, బాధితులకు పరిహారం చెల్లించారు. కాకినాడ-జొన్నాడ రోడ్డు భూసేకరణకు నిధులివ్వాల్సి ఉంది. ఈ మేరకు ప్రతిపాదనలను ఆర్‌అండ్‌బీ కాకినాడ సర్కిల్ అధికారులు ప్రభుత్వానికి పంపారు.

కెనాల్ రోడ్డు ఇలా..

కాకినాడ-ధవళేశ్వరం మధ్య సామర్లకోట, బిక్కవోలు, అనపర్తి, ద్వారంపూడి మీదుగా కెనాల్‌రోడ్డు ఉంది. 2010లో అప్పటి ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు నుంచి రూ.300 కోట్లు మంజూరు చేయించింది. కాకినాడ-సామర్లకోట వరకు నాలుగు వరుసలు, వేట్లపాలెం నుంచి వెడల్పు తగ్గించి రహదారి విస్తరణ పనులను ఒక సంస్థకు అప్పగించింది. ప్రాథమిక దశలోనే చేతులెత్తేసింది. తాజా ప్రతిపాదనల్లో మొత్తం రహదారిని నాలుగు వరుసల్లో విస్తరించేలా ప్రతిపాదించారు. దీని కోసం పట్టుబట్టి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పోరాడుతున్నారు. సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లారు.

భూసేకరణే సవాలు

కాకినాడ-జొన్నాడ రహదారిలో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. హైదరాబాద్, విజయవాడల నుంచి రావులపాలెం, మండపేట, రామచంద్రపురం, కాకినాడ ప్రాంతాలకు వచ్చే వాహనాలకు ఈ మార్గం కీలకం. పీపీపీ విధానంలో విస్తరణకు పచ్చజెండా ఊపినా భూసేకరణ పెద్ద సవాలు. పదుల సంఖ్యలో గ్రామాలు ఉన్నాయి. కొన్నిచోట్ల బైపాస్ రోడ్డు ప్రతిపాదించారు. ఆర్ అండ్‌బీ కాకినాడ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ జె.కాంతుమార్ నిధులు వస్తే రెండు, మూడేళ్లలో ఈ రెండు రహదారుల పనులు పూర్తవుతాయని తెలిపారు.

రాష్ట్ర రహదారి	పొడవు (కి.మీ)	ప్రస్తుత వెడల్పు (మీటర్లు)	విస్తరణ తర్వాత వెడల్పు (మీటర్లు)	అవసరమైన నిధులు (రూ.కోట్లు)
కాకినాడ- జొన్నాడ	53	7	16	1,500
కాకినాడ- ధవళేశ్వరం	68.3	7	16	1,200

గుణగణాలు కీర్తించి.. పరిణయానికి ఒప్పించి!

నేత్రపర్వంగా ఎదుర్కోలు ఉత్సవం.. వామన అవతారంలో శ్రీనివాసుడి దర్శనం



వామనావతారంలో స్వామివారు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ఆశ్వయుజ మాస తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం ఎదుర్కోలు ఉత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత ఆలయ ఆవరణలో అర్చకులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడిని వెండి శేష వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించి.. పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు, అర్చకులు రెండు వర్గాలుగా ఏర్పడి.. ఒకరు స్వామివారి, మరొకరు అమ్మవార్ల గుణగణాలు కొనియాడి.. పెళ్లికి ఒప్పించిన తీరు భక్తులకు కనువిందైంది. ప్రత్యేక అలంకారాల్లో భాగంగా స్వామివారు వామనావతారంలో దర్శనమిచ్చారు. హనుమద్వాహనాన్ని అధిరోహించి ద్వారకాతిరుమల పురవీధుల్లో శ్రీరాముని అలంకారంలో విహరించారు. ● కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఏడు గంటలకు సింహ వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం, రాత్రి 8 గంటలకు స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం, వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం ఉంటాయి.

ఖైదీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



సమీక్షలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

దానవాయిపేట, (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: బెయిల్, జామీనుల విషయంలో ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరంలోని జిల్లా ప్రధాన న్యాయస్థానంలోని అండర్ ట్రయిల్ ముద్దాయిల కమిటీ, ఎగ్జిక్యూటివ్ బాడీ, హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసులపై ఉమ్మడి జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ కేసుల దర్యాప్తు, ఛార్జిషీట్ ఫైల్ చేసే విషయంలోను పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఖైదీల సమస్యలు, బెయిల్ జామీను విషయంలో తీసుకోవాల్సి చర్యలపై చర్చించారు. అనంతరం వాటిని సంబంధిత న్యాయస్థానాలకు సిఫార్సులు చేశారు. బాధితుల పరిహారాలకు సంబంధించిన అంశాలను ఆమోదించారు. ప్రమాద కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో సుప్రీం కోర్టు ఆదేశాలను అనుసరించాలన్నారు. డిసెంబరు 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.శివకుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.అనురాధ, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు, తూర్పు ఎస్పీ డి.నరసింహకిషోర్, కాకినాడ, కోనసీమ ఏఎస్పీలు ఎం.జె.వి.భాస్కరరావు, ఎ.వి.ఆర్.పి.బి.ప్రసాద్, రాజమహేంద్రవరం జేసీ ఎస్.చిన్నరాయుడు, పీపీ సీహెచ్.ప్రసాద్, కొత్తపేట, అమలాపురం ఆర్డీవోలు, కేంద్ర కారాగారం మహిళా, పురుషుల జైలు అధికారులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీసులకు చిక్కిన అంతర జిల్లాల కేటుగాళ్లు

కడియం: కడియం మండలంలోని కడియపులంక గ్రామంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన చోరీ ఉదంతాన్ని పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ఇన్‌ఛార్జి డీఎస్పీ కె.రమేష్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జూన్ 18 2024న రాత్రి కడియపులంక గ్రామానికి చెందిన కర్రి వెంకటేశ్వరరావు నివాసంలో చోరీ జరిగింది. ఈఘటనలో 108 గ్రాముల బంగారు ఆభరణాలు, మూడు కేజీల వెండి వస్తువులు లాకరులో ఉంచిన రూ1.08 లక్షల నగదు గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి చోరీ చేసినట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం ఉదయం కడియం సీఐ వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం సీసీఎస్ సీఐ వై.రాంబాబు సిబ్బందితో కలసి కడియపులంకలో చాకలి రేవుదగ్గర అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా గుంటూరు జిల్లా తెనాలి మండలం నందివెలుగు గ్రామానికి చెందిన పిల్లి సురేష్ అలియాస్ శివ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం తాతపూడి గ్రామానికి చెందిన కాండ్రేగుల శ్రావణకృష్ణ అలియాస్ శ్రవణ్‌లుగా గుర్తించారు. దర్యాప్తులో వీరిరువురూ అనేక నేరాలకు పాల్పడినట్లు రుజువైంది. వీరి చేసిన చోరీలకు సంబంధించి వెండి, బంగారు వస్తువులను మూడో వ్యక్తిగా ఉన్న అనపర్తి మండలం కుతుకులూరు గ్రామానికి చెందిన పోతంశెట్టి గోపాలకృష్ణ అలియాస్ రెడ్డి వద్ద దాచేవారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో రెండు చోరీలు, ప్రకాశం జిల్లా దర్శి, బాపట్ల జిల్లా చందోలులో ఒక్కొక్కటి చొప్పున చోరీలకు పాల్పడినట్లు విచారణలో నేరాన్ని అంగీకరించారు. కడియం పోలీసు స్టేషన్ పరిధిలో చోరీకి గురైన వస్తువులతోపాటు పెనుగొండ, దర్శి తదితర ప్రాంతాలలో చోరీ చేసిన బంగారు వస్తువులు 16.738 కాసులు(129 గ్రాములు), 7.8 కేజీల వెండి వస్తువులను వీరి నుంచి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండుకు తరలించామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసు ఛేధనలో కీలక పాత్ర పోషించిన కడియం సీఐ వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం సీసీఎస్ సీఐ వై.రాంబాబు సిబ్బందిని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో ఉన్నాం'



మాట్లాడుతున్న హర్ష కుమార్

టి.నగర్, న్యూస్‌టుడే: త్వరలో జరిగే ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన తరఫున అభ్యర్థి పోటీ చేయనున్నట్లు మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ త్వరలో అభ్యర్థిని ప్రకటిస్తామని గెలుపు ఖాయమని పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు సంబంధించిన నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడిన వారంతా అబద్ధాలు చెప్పారన్నారు. నెరవేరని వాగ్దానాలను అమలు చేసినట్లు ప్రకటించారన్నారు. కక్ష సాధింపులు ఉండవని చెప్పిన చంద్రబాబు, అధికారం చేపట్టాక అంతా కక్ష సాధింపు పనులు చేస్తున్నారన్నారు. జగన్‌ను దళిత ద్రోహిగా ప్రకటించారని, ఆయన హయాంలో దళితులను చంపేశారని, దాడులు చేశారని ఆరోపించిన కూటమి నేతలు తీరా అధికారం వచ్చాక వాటిపై విచారణ లేకుండా మిన్నకుండిపోయారన్నారు. జగన్ హయాంలో జరిగిన దారుణాలు, హత్యల ఆరోపణలపై విచారణ ఏదని ప్రశ్నించారు. జగన్ నిలిపివేసిన పథకాలను పునరుద్ధరిస్తామన్న చంద్రబాబు వాటి మాటే మరిచారన్నారు. మెడికల్ సీట్లు జగన్ అమ్మేసుకొన్నాడని ప్రచారం చేశారని, ఇప్పుడే అదే విధానం అమలు చేయాలని హైకోర్టులో కూటమి వాదనలు వినిపిస్తోందని విమర్శించారు. ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలకు న్యాయం చేయలేదన్నారు. ప్రత్యేక హోదా అంశం గంగలో కలిపేశారన్నారు. ఇసుక విధానంపై సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టకూడదని ఆదేశించడం దారుణమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులు తప్పకుండా ఓటు హక్కు నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు.

ఎంఈడీలో ప్రవేశాలకు 21 వరకు గడువు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం మంగళవారపుపేటలోని గరిమెళ్ల సత్యనారాయణ ప్రభుత్వ బీఈడీ కళాశాలలో ఎంఈడీ కోర్సులో చేరేందుకు ఈనెల 21వ తేదీ వరకు అవకాశం ఉందని ప్రిన్సిపల్ కె.బ్రహ్మాచారి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 21వ తేదీ లోగా కళాశాలలో సంప్రదించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఎంఈడీ కోర్సులో చేరవచ్చన్నారు. ఇతర వివరాలకు 9395381133కి ఫోన్ చేసి పనిదినాల్లో తెలుసుకోవచ్చని సూచించారు.

టెట్‌కు 405 మంది హాజరు

శ్యామలాసెంటర్(రాజమహేంద్రవరం): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) బుధవారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. ఉదయం జరిగిన పరీక్షకు 240కి 201 మంది హాజరుకాగా 39మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 240కి 204మంది హాజరవ్వగా 36 మంది గైర్హాజరయ్యారని డీఎస్ఈఓ కె.వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు.

జయశ్రీ ప్రతిభ

రూ.1.54 కోట్ల వార్షిక వేతనంతో అమెజాన్‌లో కొలువు



మల్లిపూడి జయశ్రీ

రామచంద్రపురం, న్యూస్‌టుడే: కాకినాడ పట్టణానికి చెందిన మల్లిపూడి జయశ్రీ ఇటీవల అమెరికా వాషింగ్‌టన్ స్టేట్, సియాటిల్ పట్టణ అమెజాన్‌లో ఎస్‌డీఈ ఉద్యోగానికి ఎంపికై రూ.1.54కోట్ల వార్షిక జీతంతో ఉద్యోగం సాధించింది. కాకినాడ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన జయశ్రీ 984/1000 మార్కులు సాధించింది. ఎన్ఐటి తాడేపల్లి గూడెంలో బి.టెక్ కంప్యూటర్ సైన్సు కోర్సు చదివి డిస్టెన్షన్‌లో మార్కులు సాధించింది. తొలుత హైదరాబాద్ టీసీఎస్‌లో ఉద్యోగం పొందింది. అనంతరం అమెరికా దేశంలోని టెక్సాస్‌లో మాస్టర్స్ ఇన్ కంప్యూటర్ సైన్సు చేశారు. రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన ఆమె ప్రఖ్యాత కంపెనీ అమెజాన్ యూఎస్ఏ సియాటిల్‌లో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీర్(ఎస్‌డీఈ)గా ఎంపికయ్యారు. నవంబరు 4వ తేదీన ఉద్యోగంలో చేరేందుకు ఉత్తర్వులు అందుకున్నారు. జయశ్రీ తండ్రి శ్రీనివాస్ డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణ కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తుండగా, తల్లి సత్యనారాయణమ్మ గృహిణి.

యువకుల పాలిట విషాద రేవు

- గోపులంక పుష్కరరేవులో ఇంజినీరింగ్ విద్యార్థి గల్లంతు
- ఆరుగురు స్నేహితుల కళ్లెదుటే నీట మునక




గోదావరిలో పడవపై గాలిస్తున్న జాలర్లు, (అంతరచిత్రం) కుతాని సాయిచంద్ర

తాళ్లరేవు, న్యూస్‌టుడే: విహారయాత్ర ఆ విద్యార్థుల్లో విషాదం నింపింది. రాజమహేంద్రవరానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి కుతాని సాయిచంద్ర(21) గోపులంక పుష్కరరేవులో బుధవారం స్నానానికి దిగి గల్లంతయ్యాడు. తమ కళ్ల ఎదుటే స్నేహితుడు నీటిలో మునిగిపోవడంతో మిగిలిన ఆరుగురు తేరుకోలేకపోతున్నారు. ఇదే ప్రాంతంలో ఏడాది కిందట నలుగురు మృతి చెందడం గమనార్హం.

యానాం వెళ్లి వస్తూ..

కోరింగ ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో అఖరి సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులు బుధవారం కారులో యానాం విహార యాత్రకు వెళ్లారు. ఇందులో రాజమహేంద్రవరానికి చెందిన కుతాని సాయిచంద్ర, రవ్వా మంజుల్, వేంపాటి సంతోష్, నిఖిల్, తణుకుకు చెందిన మండా వంశీ, కార్తీక్, తాడేపల్లిగూడేనికి చెందిన శివరామ్ ఉన్నారు. మధ్యాహ్నం యానాం నుంచి తిరిగి వస్తూ తాళ్లరేవు మండలం ఇంజరం పంచాయతీ గోపులంక వద్ద గోదావరి పుష్కర రేవు వద్ద ఆగారు. గోదావరిలో స్నానం చేసేందుకు దిగారు. కొద్దిసేపటి తర్వాత సాయిచంద్ర స్నేహితుల కళ్లెదుటే నీటిలో మునిగి గల్లంతయ్యాడు.

ఈత రాకుండానే దిగాడా..?

మిత్రుడిని రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయిందని మిగిలిన ఆరుగురు యువకులు కన్నీటిపర్యంతమయ్యారు. ఆ విద్యార్థికి ఈత రాకపోవడంతో మునిగిపోయినట్లు భావిస్తున్నారు. ఆ ప్రాంతంలో లోతు ఎక్కువగా ఉండటం, మేట వేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. గల్లంతైన విద్యార్థి కోసం జాలర్లు పడవలపై గాలించారు. అతడికి తల్లిదండ్రులు, సోదరి ఉన్నారు. రాజమహేంద్రవరంలోని ఎ.వి.అప్పారావు రోడ్డు ప్రాంతంలో నివసిస్తున్న కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందజేశారు.

ఏడాది కిందట ఏం జరిగిందంటే..

గత ఏడాది అక్టోబరు 21న ఇదే ప్రాంతంలో స్నానానికి దిగి నలుగురు విద్యార్థులు మృతి చెందారు. ఒకరోజు తర్వాత వారి మృతదేహాలు లభించాయి. ఆ రోజు పశ్చిగోదావరి జిల్లా తణుకుకు చెందిన ఆరుగురు యువకులు యానాం విహార యాత్రకు వెళ్లి తిరిగి వస్తూ ఇక్కడ స్నానానికి దిగారు. ఒక యువకుడు మునిగిపోగా.. రక్షించేందుకు వెళ్లిన ముగ్గురితో కలసి నలుగురూ ప్రాణాలు కోల్పోయారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

రాజానగరం: భర్త పెట్టే చిత్రహింసలు భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన కొంతమూరు పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మనోహర్ తెలిపిన సమాచారం మేరకు.. కొంతమూరు గ్రామంలోని భవానీపురానికి చెందిన కోడి అమృతవర్షిణి.. ఇంట్లో వారికి ఇష్టం లేకుండా 2019లో కోడి రమేష్ అలియాస్ మహేష్ అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. వారికి ముగ్గురు సంతానం. భర్త ప్రతీరోజూ తాగి వచ్చి తనను శారీరకంగా, మానసికంగా హింసించడంతో అమృతవర్షిణి అనేక పర్యాయాలు పుట్టింటికి వెళ్లిపోయింది. భర్త మారతాడని మరలా కాపురానికి వచ్చింది. అయినప్పటికీ ప్రతీరోజూ తాగివచ్చి తనను హింసించడంతో ఈ నెల 15వ తేదీ అర్ధరాత్రి తరువాత.. వారు అద్దెకు ఉంటున్న ఇంట్లో చీరతో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

దేవరపల్లి: పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం రాత్రి పడుకున్న వ్యక్తి తెల్లారేసరికి మృతి చెంది ఉడడంతో పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. దేవరపల్లి గ్రామానికి చెందిన కాగిత ప్రసాద్(62)కు ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి సంతానం. కుమారులిద్దరూ 20 ఏళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. భార్య కరోనా సమయంలో మృతి చెందారు. కుమార్తెకు వివాహం అవ్వగా రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్నారు. భార్య బిడ్డలు దూరం అవ్వడంతో ప్రసాద్ మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి స్థానిక పెట్రోల్ బంక్ వద్ద పడుకొన్నాడు. బుధవారం బంక్ సిబ్బంది లేపినా లేవకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతి చెందాడని నిర్ధారించారు.

నర్సుల అసోసియేషన్ ఎన్నికలకు 17 నామపత్రాలు



నామపత్రాలు స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి నందన

మసీదు సెంటర్(కాకినాడ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్నికలకు సంబంధించి జీజీహెచ్‌లో మొత్తం 17 నామపత్రాలు స్వీకరించినట్లు ఎన్నికల అధికారి టి.నందన బుధవారం తెలిపారు. జాబితాలో 243 మంది ఓటర్లు ఉన్నారన్నారు. బుధవారం సాయంత్రం 4 వరకు నామపత్రాలు స్వీకరించామన్నారు. గురువారం పరిశీలిస్తామన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు 18 వరకు గడువు ఉందన్నారు. 23న ఎన్నికలు జరుగుతాయని, అదే రోజు ఫలితాలు ప్రకటిస్తామన్నారు. అధ్యక్ష పదవికి 3, ఉపాధ్యక్ష పదవికి 2, కార్యదర్శికి 3, కోశాధికారికి 3 నామినేషన్లు, ఈసీ సభ్యుల స్థానాలకు 6 నామినేషన్లు వచ్చాయన్నారు. అధ్యక్ష పదవికి కాకినాడ జీజీహెచ్ హెడ్‌నర్సులు బూరిగ విజయలక్ష్మి, గోడి మేరి సుజాత, అయితాబత్తుల చినధనలక్ష్మి, ఉపాధ్యక్ష పదవికి జీజీహెచ్ నుంచి హెడ్‌నర్సు బొడ్డే రాణి, రాజమహేంద్రవరం జీజీహెచ్ నుంచి స్టాఫ్ నర్సు అంజలీశ్రీ నామినేషన్లు వేశారన్నారు. అధికారులు శివకామేశ్వరరావు, బి.గణేష్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పెళ్లి.. అదనపు కట్నానికి వేధింపులు

భర్త దాడిలో మహిళ మృతి

రాజమహేంద్రవరం నేరవార్తలు: ప్రేమించి పెళ్లి చేసుకొన్న వ్యక్తి అదనపు కట్నం కోసం భార్యను వేధించి, విచక్షణా రహితంగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందింది. ఈ ఘటన రాజమహేంద్రవరం గ్రామీణం బొమ్మూరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కాశి విశ్వనాథం వివరాల మేరకు రాజమహేంద్రవరం ఇన్నీసుపేటకి చెందని కర్రి ఈశ్వర్ నగరంలో ఏసీ మెకానిక్‌గా పని చేస్తుంటాడు. ఆయన హుకుంపేట డీ బ్లాక్‌కు చెందిన దుర్గభవాని(19)ని రెండేళ్ల కిందట ప్రేమించి పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి సమయంలో ఈశ్వర్‌కు రూ.1.50 లక్షలు కట్నం ఇచ్చారు. ఇటీవల కొంత కాలంగా అదనంగా కట్నం తీసుకురావాలని భార్యను వేధించడం మొదలుపెట్టాడు. ఆ క్రమంలో భర్తతో గొడవపడిన దుర్గాభవాని నెల రోజులుగా తల్లి లక్ష్మి వద్ద ఉంటోంది. గత అర్ధ రాత్రి మద్యం తాగి అత్తవారి ఇంటికి వచ్చిన ఈశ్వర్ భార్యతో గొడవపడ్డాడు. ఆమెను నేలపై పడేసి చేతులు, కాళ్లతో విచక్షణ రహితంగా దాడి చేశాడు. ఆ ఘటనలో అపస్మారకస్థితికి చేరుకున్న భవానిని స్థానికుల సహాయంతో తల్లి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. బుధవారం సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఈశ్వర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. గత కొంత కాలంగా ఈశ్వర్ పనికి కూడా వెళ్లకుండా నగదు కోసం తన కుమార్తెను నిత్యం వేధింపులకు గురి చేశాడని మృతురాలి తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్ళలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	13,000-13,500
కొత్త (పచ్చి) కాయ	12,500-13,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	135-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

రాజమహేంద్రవరం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

దేవీచౌక్: అత్యవసర మరమ్మతుల నిమిత్తం గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొంతమూరులోని శ్రీరామ్‌నగర్, కళ్యాణ్‌నగర్, ఆదర్శనగర్, ఎన్జీవోస్ కాలనీ, జంగాల కాలనీ, బీసీ కాలనీ, శేషాద్రి లేఔట్, క్వారీ ప్రాంతం, వీవీ కొండయ్యనగర్, నాలుగో బ్రిడ్జి ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా అంతరాయం ఏర్పడుతుందన్నారు.

రేపు రెండు ప్రాంతాల్లో..: శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సంజీవ్‌నగర్, పనసచెట్టు సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ తెలిపారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.



రతన్ టాటా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సభ్యులు

రతన్ టాటాకు నివాళి

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : ముంబైలోని తాజ్ హోటల్‌పై దాడి జరిగినపుడు ఆత్మస్థైర్యంతో ఎదుర్కొని మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు బాసటగా నిలిచిన దిగ్గజం రతన్ టాటా అని పీస్ పర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ లంక సత్యనారాయణ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రతన్ టాటా సంస్మరణ సభ నిర్వహించి ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అతి తక్కువ ధరల్లో కార్లు తయారు చేసి సామాన్యులకు సైతం అందుబాటులో తీసుకొచ్చారని కొనియాడారు. గువ్వల వెంకటేశ్వరరావు, చల్లగాలి వెంకట రామరాజు, సిరికి అక్కునాయుడు, ఆకాశం గౌరీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న కమిషనర్ కేతన్ గర్గ్

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాల్సిన అవసరం ఉందని కమిషనర్ కేతన్ గర్గ్ తెలిపారు. కొటక్ మహీంద్రా బ్యాంకు కార్పొరేటు సామాజిక బాధ్యత నిధులతో దానవాయిపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి చేసిన క్రీడా ప్రాంగణాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించడం వల్ల ఉన్నత స్థానాలకు చేరగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ర్యాంకు సాధనకు కృషి..

టి.నగర్: స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో నగరానికి ఉత్తమ ర్యాంకు సాధించే ప్రక్రియలో యంత్రాంగం సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కేతన్ గర్గ్ కోరారు. ఆయన బుధవారం నగరంలో ఎస్టీపీ ప్లాంటు నిర్వహణను పరిశీలించారు. కంపోస్టు యూనిట్లు, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ, విండ్రో ప్లాంట్లు పూర్తిస్థాయిలో పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వర్మీ కంపోస్టు ప్రక్రియను మెరుగుపర్చాల్సి ఉందన్నారు. తడి పొడి చెత్త సేకరణ, రీ-సైక్లింగ్ విధానంలో లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు: దానవాయిపేట(రాజమహేంద్రవరం): శ్యామల, ఊర్వశి: వేట్టయన్, రాజా: మార్టిన్, కుమారి, సూర్యప్యాలెస్, అప్సర: దేవర, శివజ్యోతి, అశోక్: విశ్వం, స్వామి: స్వాగ్, అనుశ్రీ: జనక అయితే గనక, సూర్యమినీ: జిగ్రా, రంభ: మా నాన్న సూపర్ హీరో, మేనక: సత్యం సుందరం, మార్టిన్(రెండేసి ఆటలు), వీఏస్ మహల్: వేట్టయన్, దేవర(రెండేసి ఆటలు).

ఆర్డీవోను కలిసిన తెదేపా నాయకులు

టి.నగర్: రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్‌ను బుధవారం తెదేపా రాష్ట్ర కార్యదర్శి కాశీ నవీన్‌కుమార్ బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గంగాధర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

థైరాయిడ్ పరీక్షలకు బయటకెళ్లాల్సిందే..!

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

చందాదారులుగా ఉన్న కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించాల్సిన ఆసుపత్రి ఇది. ప్రస్తుతం ఇక్కడికి వచ్చే రోగులకు అరకొర సేవలతోనే సరిపెడుతున్నారు. వైద్యం మాటలా ఉన్నా కనీసం రోగ నిర్ధారణ పరీక్షలు కూడా పూర్తిస్థాయిలో నిర్వహించలేని దుస్థితి. ఇక థైరాయిడ్ నిర్ధారణ పరీక్షలైతే పూర్తిగా నిలిచిపోయాయి. కొన్నిరకాల రక్త పరీక్షలు బయటకెళ్లి చేయించుకోవాల్సిందే. రక్తపరీక్షలకు అవసరమైన కిట్లు, కెమికల్స్ పూర్తిస్థాయిలో సరఫరా లేదు. స్థానికంగా కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ఎవరైనా దాతలు కిట్లు, కెమికల్స్ సమకూరిస్తే రక్తపరీక్షలు నిర్వహించే పరిస్థితి. ఇదీ రాజమహేంద్రవరంలోని కార్మిక ప్రభుత్వ బీమా ఆసుపత్రి(ఈఎస్‌ఐ)లో వ్యాధి నిర్ధారణ పరీక్షల ల్యాబ్ దుస్థితి. ఈ ఆసుపత్రి పరిధిలో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు కలిపి సుమారు 7 లక్షల మంది వరకు ఉన్నారు. ప్రస్తుతం ఇక్కడ మంగళ, శుక్రవారాల్లో 150 నుంచి 200లకుపైగా, మిగిలిన రోజుల్లో 50 నుంచి 100 వరకు ఓపీ ఉంటుంది. ఇక్కడి ల్యాబ్‌లో రోజుకు 30 నుంచి 50 వరకు పరీక్షలు జరుగుతున్నాయి. అయితే అవి షుగర్, కొలెస్ట్రాల్ వంటి సాధారణ పరీక్షలే తప్ప కొన్ని రోగాల నిర్ధారణకు మాత్రం బయటకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాల్సి వస్తుందని పలువురు రోగులు చెబుతున్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రిలో ఇదీ పరిస్థితి



ఈఎస్ఐ ఆసుపత్రిలో రక్త పరీక్షలు నిర్వహించే ల్యాబ్



నిరుపయోగంగా పరికరం

కిట్ల సరఫరా లేక సమస్య..

కొన్ని రోగాల నిర్ధారణకు సంబంధించి ఈఎస్ఐ ల్యాబ్‌లో పరీక్షలు చేసేందుకు అవసరమైన కెమికల్స్, కిట్లు పూర్తిస్థాయిలో సరఫరా లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. సామాజిక బాధ్యతగా పేపరుమిల్లు, ఇతర సంస్థలు, దాతలు కిట్లు, కెమికల్ సమకూరుస్తుంటే వాటితో పరీక్షలు చేస్తున్నారు. గతంలో కెమికల్, కిట్లు లోకల్‌గా కొనుగోలుకు కొంత బడ్జెట్ కేటాయించేవారని ఇప్పుడు దానిని నిలిపివేయడం... పైనుంచి కూడా పూర్తిస్థాయిలో వాటి సరఫరా లేకపోవడం సమస్యకు కారణంగా చెబుతున్నారు.

ఇద్దరే సిబ్బంది..

ఇక్కడి రక్త పరీక్షల పరీక్షల ల్యాబ్‌లో ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు, ఒక సహాయకుడు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఇద్దరే సిబ్బంది ఉన్నారు. ల్యాబ్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది. ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్‌లో ఒకరు రెగ్యులర్ కాగా ఇంకొకరు కొవ్వూరు నుంచి డిప్యూటేషన్‌పై వచ్చి ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. ఇద్దరిలో ఎవరైనా ఒకరు సెలవు పెడితే రక్తపరీక్షలకు చేసేందుకు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉంది.

రూ. లక్షల పరికరం నిరుపయోగం..

ఇక ఇక్కడి థైరాయిడ్ టెస్టింగ్ మిషన్ అయితే నిరుపయోగంగా మారింది. కొవిడ్ సమయంలో కాకినాడ సీపోర్ట్స్ లిమిటెడ్(కేఎస్‌పీఎల్) ఆర్థిక సహకారంతో ఈ పరికరం సమకూరింది. రూ.లక్షల విలువ చేసే పరికరం అందుబాటులో ఉన్నా థైరాయిడ్ పరీక్షలకు అవసరమైన కెమికల్స్ లేకపోవడంతో కొంత కాలం పరీక్షలు నిలిపేశారు. తర్వాత అవి సమకూరినప్పటికీ థైరాయిడ్ టెస్టింగ్ యంత్రం పని చేయకుండా పోయింది. దీంతో ఈ పరీక్షలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇదికాక ల్యాబ్‌లోని సెల్ కౌంట్ పరికరం గతంలోనే మరమ్మతులకు గురై మూలకు చేరగా పేపరుమిల్లు సహకారంతో సమకూర్చిన పరికరంతోనే ప్రస్తుతం కొన్ని రక్త పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నారు

వైద్యాధికారి ఏమంటున్నారంటే..

దీనిపై ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ హుస్సేన్‌ను వివరణ కోరగా ప్రస్తుతం ల్యాబ్‌లో రక్తపరీక్షల నిర్వహణ విషయంలో ఇబ్బందులేమీ లేవని చెబుతున్నారు. థైరాయిడ్ మిషన్ విషయంలో టెక్నికల్ సమస్య ఉందన్నారు. టెక్నీషియన్లు వచ్చి చూశారని, ఆ మిషన్ సక్రమంగా పని చేయాలంటే ఎక్కువ కూలింగ్ ఉండే ప్రత్యేక గదిలో దానిని పెట్టాల్సి ఉందని కొత్త భవనం అందుబాటులోకి వస్తే ఈ సమస్య కూడా పరిష్కారమతుందని అన్నారు.

పాఠశాలల్లో పరిశుభ్రతపై జాగ్రత్తలు తీసుకోవాలి

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల మరుగుదొడ్ల నిర్వహణలో భాగంగా శానిటరీ లిక్విడ్ కిట్లను డీఐ బి.దిలీప్‌కుమార్ బుధవారం ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. అర్బన్ పరిధిలోని ప్రభుత్వ, మున్సిపల్, ప్రాథమికోన్నత పాఠశాలలకు వీటిని అందజేసినట్లు ఆయన తెలిపారు. పాఠశాలల్లో పరిశుభ్రత విషయంలో ప్రధానోపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్‌టీలు జయంతిశాస్త్రి, జె.శ్రీనివాసరావు, పి.ప్రసాద్, కోటేశ్వరి, ఇందిర, నాగలక్ష్మి పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయులకు శానిటరీ కిట్ అందజేస్తున్న డీఐ దిలీప్‌కుమార్

'కూటమి అభ్యర్థిని గెలిపించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

టి.నగర్, న్యూస్‌టుడే: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం సాయంత్రం నియోజకవర్గం ఇన్‌ఛార్జిలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసినప్పటికీ మళ్లీ ఓటరుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, దీనిపై అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. 90 శాతం మంది పట్టభద్రులు కూటమికి అనుకూలంగా ఉన్నారన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వి.చిరంజీవి, కూటమి నాయకులు యర్రా వేణుగోపాలరాయుడు, అత్తి సత్యనారాయణ, బొమ్ముల దత్తు మాట్లాడుతూ ఐక్యతతో అభ్యర్థిని గెలిపించుకోవాల్సి ఉందన్నారు. కలిసి కట్టుగా ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో రోగాలు దూరం



చేతులు శుభ్రం చేసుకుంటున్న చిన్నారులు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు నిర్వహించాయి. స్థానిక ఎస్‌కేవీటీ పాఠశాలలో మ్యాజిక్‌బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి ప్రియాంక మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం చేసేముందు, తర్వాత సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. చేతి గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు అప్పారావు, ఉపాధ్యాయులు బి.విజయకుమారి, దొర, శ్రీనివాస, పీఈటీ స్వర్ణలత, స్వాతి పాల్గొన్నారు. ■ లాలాచెరువు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వరరావు మాట్లాడుతూ చేతులు పరిశుభ్రంగా ఉంటే సగానికి పైగా రోగాలు మన దరి చేరవన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

దస్త్రాల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం కలెక్టరేట్: జిల్లాలోని ఆయా పాఠశాలలు, కళాశాలల్లో 'మన బడి-మన భవిష్యత్తు' కింద రెండో దశలో చేపట్టిన 655 పనులకు సంబంధించిన దస్త్రాల(ఎంబుక్) నిర్వహణ తీరుపై జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. దస్త్రాల నిర్వహణ విషయంలో ఇంజినీరింగ్ సహాయకుల నిర్లక్ష్య వైఖరిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నాలుగు ఇంజినీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణాలు, ఇతర మౌలిక వసతుల కల్పన పనులకు సంబంధించి ఖర్చు రికార్డుల ఆడిటింగ్‌పై సమీక్షించారు. జిల్లాలో మన బడి- మన భవిష్యత్తు కింద సుమారు రూ.200 కోట్లతో పాఠశాలు, కళాశాలల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, సర్వశిక్షా, మున్సిపల్ ఇంజిరింగ్ విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పనులకు సంబంధించి దస్త్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సర్వశిక్షా అధికారిణి సుభాషిణి, సహాయ ఇంజినీర్లు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు చారిత్రాత్మకం

టి.నగర్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రక ఉద్యమ విజయమని ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు తెలిపారు. వర్గీకరణకు అనుకూలంగా తీర్పు నేపథ్యంలో హిందూపురం నుంచి చేపట్టిన కృతజ్ఞత యాత్ర బుధవారం రాజమహేంద్రవరం చేరుకొంది. గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వర్గీకరణకు చంద్రబాబు సైతం మద్దతు తెలపడంతోపాటు మాదిగలకు రాజకీయ చైతన్యం కల్పించారన్నారు. చర్మకారుల అభివృద్ధికి అన్ని విధాలా కూటమి ప్రభుత్వం సహకరించాలని, ఎస్సీ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలని కోరారు. వైకాపా హయంలో మాదిగలు అన్ని విధాలా నష్టపోయారన్నారు. అనంతరం ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి ు చేరుకొని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుజన్ రావు, వెంకట్రాజు, చింటు తదితరులు పాల్గొన్నారు.

ఆహార ప్రాముఖ్యత తెలుసుకోవాలి

రాజమహేంద్రవరం సాంస్కృతికం: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహించారు. ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాఘవ కుమారి ఆహార ప్రాముఖ్యతను వివరించారు. వైస్ ప్రిన్సిపల్ కె.ఎస్.రత్నకుమార్, జువాలజీ విభాగాధిపతి ప్రియాంక ఆహార భద్రత విషయంలో పాటించాల్సిన జాగ్రత్తలు తెలిపారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆహార దినోత్సవ వేడుకలో వైస్ ప్రిన్సిపల్ రత్నకుమార్, విద్యార్థులు

ఛాంబర్ బిల్డింగ్ ట్రస్టు కార్యదర్శిగా సురేష్‌కుమార్

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: ది ఛాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగ్ ట్రస్టు కార్యదర్శిగా పచ్చిగోళ్ల సురేష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన ట్రస్టు సభ్యుల సమావేశంలో సురేష్‌కుమార్‌ను కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఛాంబర్ అధ్యక్షుడు తవ్వా సూర్యనారాయణమూర్తి, బిల్డింగ్ ట్రస్టు ఎక్స్ అఫీషియో ట్రస్టీ శ్రీనివాస్, లైఫ్ ట్రస్టీలు వెంకటేశ్వరరావు, శివకుమార్, విక్రమ్ ఎస్.జైన్, సత్యగోపాలకృష్ణ, విజయ్‌కుమార్, ఎలక్టడ్ ట్రస్టీలు శివమల్లికార్జున, బ్రహ్మానందం తదితరులు అభినందించారు.



సురేష్‌కుమార్‌ను అభినందిస్తున్న ఛాంబర్ అధ్యక్షుడు తవ్వా, బిల్డింగ్ ట్రస్టు ట్రస్టీలు

'నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాలు పెట్టొద్దు'

వి.ఎల్.పురం: నిబంధనలకు విరుద్ధంగా నివాస ప్రాంతాల నడుమ, విద్యాలయాల చెంతన మద్యం దుకాణాలను ఏర్పాటు చేయవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్ అన్నారు. సిండికేట్‌గా ఏర్పడి కొందరు మద్యం దుకాణాలను దక్కించుకున్నారని, వీరిలో అధికార పార్టీ నేతలే అధికంగా ఉన్నారని ఆయన విమర్శించారు. సిండికేట్లు గొలుసు దుకాణాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని, దీనిపై సంబంధిత అధికారులు ఉక్కుపాతం మోపాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

మురుగు కాలువలోపడి ఒకరి మృతి

రాజమహేంద్రవరం నేరవార్తలు: హోటల్‌లో స్వీపర్‌గా పని చేసే ఓ వ్యక్తి ప్రధాన మురుగు కాలువలోపడి మృతి చెందిన ఘటన రాజమహేంద్రవరం మూడో పట్టణ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వి.అప్పారావు వివరాల మేరకు.. విజయవాడ గుణదల ప్రాంతంలోని ఉర్మిళనగర్‌కు చెందిన కాదులూరి శ్రీహరి ప్రసాద్(51) ఎనిమిది నెలలుగా గోకవరం బస్టాండు మున్సిపల్ కాంప్లెక్స్‌లోని ఓ హోటల్‌లో స్వీపర్‌గా పని చేస్తున్నాడు. సీతంపేటలో గది అద్దెకు తీసుకుని ఒంటరిగా నివసిస్తున్నాడు. విజయదశమి తర్వాత నుంచి శ్రీహరి పనిలోకి రాకపోవడంతో హోటల్ యజమాని దుర్గాప్రసాద్ బుధవారం మధ్యాహ్నం ఆయన గదికి వెళ్లి చూడగా కనిపించలేదు. స్థానిక ములగొయ్యి వద్ద ప్రధాన మురుగు కాలువ గట్టుపైన కూర్చుని మద్యం తాగుతుంటాడని తెలిసి అక్కడికి వెళ్లి పరిశీలించగా కాలువలో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చి బయటకు తీయించారు. అది శ్రీహరిదిగా పోలీసులు గుర్తించారు. నిత్యం మద్యం తాగడంతో పాటు శ్రీహరికి పలు ఆరోగ్య సమస్యలున్నాయని, తరచూ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స తీసుకునే వాడని హోటల్ యజమాని దుర్గాప్రసాద్ పోలీసులకు వివరించాడు. శ్రీహరికి కూడి కాలుపై పుండ్లు ఎక్కువగా ఉండడంతో తొందరగా నడవలేడని ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతదేహం పరిస్థితి చూస్తే మంగళవారం రాత్రి మద్యం మత్తులో కాలువలో పడి మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నట్లు సీఐ తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడి కుటుంబీకులు వివరాలు తెలుసుకుంటున్నామని, అప్పటి వరకు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరుస్తామన్నారు.

భార్యను వేధించిన భర్తకు 18 నెలల జైలు

రాజమహేంద్రవరం నేరవార్తలు: భార్యను వేధించిన భర్తకు 18 నెలల జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ జిల్లా అయిదో అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. మహిళా పోలీసు స్టేషన్ సీఐ కె.మంగాదేవి వివరాల మేరకు.. రాజమహేంద్రవరానికి చెందిన ఓ మహిళకు ఏలూరు జిల్లా దొండపాడుకు చెందిన ఊట్ల మోహన్ కృష్ణతో 2014లో వివాహమైంది. రెండేళ్లు సజావుగా సాగిన వారి దాంపత్య జీతంలో అదనపు కట్నం తీసుకురావాలనే కారణంతో మోహన్ భార్య వేధించడం మొదలుపెట్టాడు. వాటిని తాళలేక 2018లో ఆమె మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. వాదోపవాదనలు అనంతరం అయిదో అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జి.శ్రీనివాసరెడ్డి నిందితుడికి 18 నెలల జైలు శిక్షతోపాటు రూ.5 వేలు జరిమాన విధిస్తు తీర్పునిచ్చారు. ఈ కేసులో పీపీగా బి.మోహన్‌రావు వాదనలు వినిపించగా దర్యాప్తు అధికారులుగా హెచ్‌సీ ఎం.శ్రీనివాస్, పీసీ ఎస్.వినోద్ వ్యవహరించారు.

కారు ఢీకొని గాయాలు

రాజమహేంద్రవరం నేరవార్తలు : స్థానిక సుబ్బారావుపేటకి చెందిన టి.ప్రభాకర్ ద్విచక్ర వాహనంపై మంగళవారం రాత్రి జైలు రోడ్డువె ళుతుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని తలకు గాయం కావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు ఆసుపత్రి వర్గాలు మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సారాతో వ్యక్తి అరెస్టు

వెంకటనగరం ప్రాంతానికి చెందిన ఎన్.రాకేష్ ఆల్కట్‌తోట గోదావరి గట్టుపై సారా తరలిస్తుండగా రెండో పట్టణ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అతడి వద్ద ఉన్న 12 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆత్మరక్షణ.. ఏదీ శిక్షణ

పాఠశాలల్లో పునఃప్రారంభించాలని తల్లిదండ్రుల వినతి



కరాటేలో శిక్షణ పొందుతున్న చిన్నారులు (పాతచిత్రం)

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై లైంగిక దాడి.. రాజమహేంద్రవరంలోని ఓ పాఠశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపులు.. రోజూ ఇటువంటి సంఘటనలు నిత్యకృత్యమవుతున్నాయి. వీటిని ఎదుర్కోవాలంటే చిన్నప్పట్నుంచి బాలికల్లో ఆత్మస్థైర్యం, ధైర్యసాహసాలు తప్పనిసరి. దీనిని దృష్టిలో పెట్టుకొని పాఠశాల స్థాయిలో విద్యార్థులను ఆత్మరక్షణ విద్యలో తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షా ప్రశిక్షణ్ పథకాన్ని గతంలో అమల్లోకి తీసుకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో సుమారు ఏడాదిపాటు నిర్వహించినప్పటికీ కొవిడ్ తర్వాత పూర్తిగా విస్మరించారు. బాలికల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు కరాటే, తైక్వాండో వంటి ఆత్మరక్షణ విద్యలో శిక్షణ ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు కూటమి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. –న్యూస్‌టుడే, శ్యామలా సెంటర్

రాజమహేంద్రవరం నగరంలో 21 ఉన్నత, 56 ప్రాథమిక పాఠశాలలున్నాయి. వీటిలో సుమారు 15,500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి కరాటేలో శిక్షణ ఇవ్వాలంటే కనీసం సుమారు 40 మంది శిక్షకులు అవసరం. వారానికి మూడు, నెలలో 12 శిక్షణ తరగతులు తీసుకోవాలనే నిబంధన ఉంది. మహిళా శిక్షకులకు ముందుగా ప్రాధాన్యం ఇవ్వాలనే నిబంధన ఉంది. అయిదే కొన్ని ప్రాంతాల్లో వారు లేకపోవటంతో శిక్షణ ఇచ్చేందుకు పురుషులు వస్తున్నారు. వీరికి నెలకు సుమారు రూ. 5 వేలు యువజన క్రీడలశాఖ ద్వారా అందిస్తున్నారు. అయితే రెండు మూడు పాఠశాలల్లో శిక్షణ ఇచ్చేవిధంగా వీలు కల్పించాలని వారు కోరుతున్నారు. శిక్షకులు కోరుకుంటున్నారు.

రెండు నెలలే అంటే ఎలా...?

ప్రస్తుత తరుణంలో ఆత్మరక్షణ విద్య బాలికలు, మహిళలకు చాలా అవసరం. చిన్నప్పుడే ఈ విద్యపై అవగాహన ఉంటే భవిష్యత్తులో సంబంధిత క్రీడల్లో రాణించేందుకూ దోహదపడుతుంది. లైంగిక దాడులు, వేధింపులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఈ విద్య దోహదపడుతుందని శిక్షకులు అంటున్నారు. ఇంత ప్రాధాన్యమున్న అంశంపై ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం వహిస్తుందనే చెప్పాలి. శిక్షణ రెండు నెలలకే పరిమితం చేయటం వల్ల ప్రాథమికస్థాయి (బేసిక్స్) అంశాలు కూడా నేర్చుకోలేరని శిక్షకులు అంటున్నారు. కనీసం 6 నుంచి 8 నెలలపాటు శిక్షణ కొనసాగితే చిన్నారుల్లో నేర్చుకోవాలన్న తపన, ఆసక్తి పెరిగి పోటీలస్థాయికి వెళ్లేందుకు ఆస్కారం ఉంటుందని అంటున్నారు.

ఆదేశాలు రాగానే శిక్షణ ప్రారంభిస్తాం..

ప్రస్తుత తరుణంలో ఆత్మరక్షణ విద్య బాలికలకు చాలా అవసరం. గతంలో నగరంలోని నన్నయ మున్సిపల్, దానవాయిపేట ప్రభుత్వ పాఠశాలల్లో కరాటే శిక్షణ తరగతులు జరిగేవి. కొవిడ్ కారణంగా నిలిచిపోయాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే వాటిని ప్రారంభిస్తాం.

– బి.దిలీప్‌కుమార్, డీఐ

భయపెడుతున్న బహిరంగ కాలువలు

రాజమహేంద్రవరం నగరంలో బహిరంగ కాలువలు ప్రమాదకరంగా మారాయి. ప్రధానంగా గోదావరిలో కలిసే నల్లా, ఆవ ఛానల్స్‌కు అనుబంధంగా ఉన్న కాలువలు రోడ్డుకు ఆనుకొని ఉండడంతో పలువురు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో తిలక్ రోడ్డు కాలువ నిర్మాణంలో అర్ధరాత్రి అదుపుతప్పి వ్యక్తి కాలువలోపడి చనిపోయిన విషయం తెలిసిందే. ఆవ ప్రాంతంలో కాలువలో బాలుడు, సీతంపేట కాలువలో ఒక వ్యక్తి పడి చనిపోయారు. బహిరంగ కాలువల వద్ద ప్రమాద నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు విన్నవించుకొంటున్నా యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

–న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

గత పుష్కరాలకు జాతీయ కాలుష్య నియంత్రణ మండలి గోదావరి నీటి పరీక్షలు నిర్వహించింది. దీంట్లో భాగంగా నివేదికను అందించింది. గోదావరి కాలుష్యంతోపాటు, కాలువలను ఆధునికీకరించాల్సిన ఆవశ్యకతను నివేదికలో ప్రస్తావించింది.

పట్టాలెక్కని భూగర్భ డ్రెయినేజీ ప్రతిపాదన..

సాధ్యమైనంత వరకు భూగర్భ కాలువ వ్యవస్థ ఏర్పాటు చేయాలని తెలియజేయడం జరిగింది. దీంతో అప్పట్లో నగరంలో భూగర్భ కాలువల నిర్మాణానికి రూ. 600 కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి నగరపాలక సంస్థ ప్రతిపాదనలు పంపడం జరిగింది. మురుగునీటి ప్రక్షాళనలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిధులు విడుదల చేయాలని నిర్ణయించారు. అయితే పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రతిపాదనలు పక్కకు నెట్టేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో నగరంలో బహిరంగ కాలువలు ప్రమాదకరంగా మారాయి. నగరంలో నల్లా ఛానల్ సుమారు 8 కి.మీ మేర, ఆవ ఛానల్ రూ 12 కి.మీ మేర విస్తరించి ఉన్నాయి. ఆర్యాపురం, తుమ్మలావ, సీతంపేట, మూలగొయ్యి ప్రాంతాల్లో అనుబంధ కాలువలు కూడా బహిరంగంగా ఉన్నాయి. నగరంలో ప్రధాన ప్రాంతాల గుండా ఈ కాలువలు విస్తరించి ఉన్నాయి. ఎగువ సీతానగరం, కాతేరు నుంచి నగరానికి వచ్చే వాహనాలు , ఆర్టీసీ బస్సులన్నీ నల్లా ఛానల్‌ను దాటుకొని నగరంలో ప్రవేశించాల్సిన పరిస్థితి ఉంది. ఇక స్టేడియం రోడ్డు, తాడితోట, ఆవ ప్రాంతం, రామకృష్ణా థియేటర్ వెనుక ప్రాంతాలను కలుపుకొని ఆవ, రాతి ఛానల్స్ విస్తరించాయి. అనునిత్యం ఆయా మార్గాల గుండా ప్రజలు నగరంలోకి ప్రవేశించాల్సి ఉంది. వాటిని దాటుకొని వచ్చే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.



శిథిలావస్థకు చేరిన రక్షణ గోడ



ప్రమాదకరంగా నల్లా ఛానల్

కనీసం వీటికి రక్షణ గోడ లేకపోవడంతో వాహనాలు అదుపు తప్పితే నేరుగా కాలువలో పడిపోవాల్సిన పరిస్థితి ఉంది. కాలువలకు రక్షణ గోడ నిర్మించాలని గతంలోనే ప్రతిపాదనలు ఉండగా కార్యరూపం దాల్చడం లేదు. కాగా నల్లా ఛానల్‌ను ఆనుకొని అప్పట్లో నిర్మించిన పిట్టగోడ కూడా శిథిలావస్థకు చేరింది. అప్పట్లో ఎక్కువగా పశువులు కాలువలో పడిపోతున్నాయని కొత్త ఎత్తులో నిర్మించిన గోడ కూడా పూర్తిగా పాడైపోయింది. దీనిపై మున్సిపల్ ఎస్ఈ పాండురంగారావును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

ఆకట్టుకున్న నృత్యోత్సవం



నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

రాజానగరం: దివాన్‌చెరువులో విశ్వేశ్వర అమ్మవారి ఆలయంలో శారదా నర్సింగ్ హోం అధినేత డా.రాంబాబు, సుబ్బలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్యోత్సవం ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారులందరికీ రామకృష్ణ మిషన్ వారు సమకూర్చిన వ్యక్తిత్వ వికాసం పుస్తకాలను డా.రాంబాబు అందజేశారు.

కోర్టు ఏర్పాటుకు స్థల పరిశీలన



మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న జేసీ చినరాముడు

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తిలో బుధవారం సాయంత్రం జేసీ చినరాముడు పర్యటించారు. అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేశారు. అదేవిధంగా అనపర్తి మార్కెట్ యార్డును పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దారు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కావడి ఉత్సవం



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

వెలుగుబంద (రాజానగరం), న్యూస్‌టుడే: మండలంలోని వెలుగుబంద గ్రామంలో అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమంలో భాగంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేషంగా కావడి ఉత్సవాన్ని బుధవారం నిర్వహించారు. వాద్రేవు శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో ఉదయం గణపతిహోమం, సాయంత్రం కావడులతో గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రికి అయ్యప్పస్వామి పడిపూజ జరిగింది. కొత్తపల్లి శ్రీనివాస్, వాద్రేవు రవిబాబు, సానెపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లలో దీపావళి వెలుగులు

- వంటగదిపై తగ్గనున్న ఆర్థిక భారం
- మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లపై ఆసక్తి

– న్యూస్‌టుడే, అనపర్తి టౌన్



వంటగదిపై త్వరలోనే కాస్త భారం తగ్గనుంది. ఇప్పటికే కూరగాయలు, పప్పుల ధరలు పెరిగి సామాన్యులు ఇబ్బంది పడుతున్న క్రమంలో.. వంట గ్యాస్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కాస్త ఊరటగా మారనుంది. ఒక్కో పేద కుటుంబానికి మూడు సిలిండర్లు ఏడాదికి ఉచితంగా ఇవ్వనున్నారు. దీంతో ప్రతి కుటుంబం మీద ఈ ప్రభావం ఉండనుంది. ప్రస్తుతం ఒక్కో సిలిండరు ధర రూ.832 పలుకుతోంది. అంటే ఒక్కో పేద కుటుంబం పైనా మూడు సిలిండర్లకు కలిపి రూ.2,496 భారం తగ్గనుందని సామాన్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అనపర్తి నియోజకవర్గంలో దాదాపు 1.40 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా.. ఇందులో సగానికి పైగా బలహీనవర్గాలకు చెందిన వారే. వారందరికీ నూతన నిర్ణయం లబ్ధి చేకూర్చనుంది. దీపావళి నుంచి అమలు కానున్న క్రమంలో మహిళలు ఆసక్తి కనబరచడంతో పాటు.. ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది..



దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పగానే చాలా సంతోషం వేసింది. నిత్యావసరాల ధరలు పెరిగి.. పూట గడవడమే కష్టంగా మారిన ఈ రోజుల్లో ప్రభుత్వ నిర్ణయం చాలా ఊరట ఇస్తోంది. మాపై ఆర్థికభారం తగ్గడంతో పాటు.. ఇద్దరు వ్యక్తులు ఉన్న కుటుంబాల్లో మూడు సిలిండర్లు ఏడాదికి సరిపోతాయి. - చిన్ని దుర్గ, ఊలపల్లి

సిలిండర్ వాడని ఇల్లు లేదు



ఒకప్పుడు గ్యాస్ సిలిండర్ అంటే సంపన్నుల వస్తువుగా ఉండేది. అలాంటిది చంద్రబాబు గతంలో దీపం ద్వారా సామాన్యులకూ చేరువ చేశారు. ప్రతి ఇంటికీ గ్యాస్ కనెక్షన్ ఇచ్చి పొగపొయ్యిలు లేకుండా చేశారు. ఆ క్రమంలోనే ఇప్పుడు దీపావళి నుంచి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామనడం మరింత ఆనందం. తద్వారా మహిళలపై ఆర్థిక భారం తగ్గించినట్లే.

- అరుణ కుమారి, కొప్పవరం

కష్టాలు తీరుతాయి



పల్లెల్లో దిగువ పేదతరగతి వారు ఇప్పటికీ గ్యాస్ కొనలేక కట్టెలు వాడి అనారోగ్యం పాలవుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఏడాదికి రెండు గ్యాస్ సిలిండర్లు కొనుక్కోవడానికి ఇబ్బంది పడుతున్నారు. అలాంటి వారందరికీ ప్రభుత్వ నిర్ణయం చాలా మేలు చేస్తుంది. కట్టెలు వాడాల్సిన పని ఉండదు. గ్యాస్ స్టవ్ వాడకాన్ని పెంచడం ద్వారా పర్యావరణానికీ హాని జరగదు.

- స్వర్ణ లక్ష్మి, కొమరిపాలెం

పట్టభద్రుల ఓట్ల నమోదు

సీతానగరం: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓట్లు నమోదు ప్రక్రియను వేగవంతం చేశామని సీతానగరం తహసీల్దారు అంకం శ్రీనివాసు బుధవారం తెలిపారు. అర్హులైన పట్టభద్రులంతా డిగ్రీ ప్రొవిజనల్, ఆధార్, ఎలక్షన్ గుర్తింపు కార్డు నకళ్లను అందించి రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయాల వద్ద ఓటు హక్కు నమోదు చేయించుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈ ప్రక్రియను పూర్తిచేసుకోవచ్చని నవంబరు 6వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

అనపర్తి ఎంపీడీఓగా రామకృష్ణారెడ్డి

అనపర్తి గ్రామీణం: అనపర్తి ఎంపీడీవోగా రామకృష్ణారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కపిలేశ్వరపురం ఎంపీడీవోగా పనిచేసిన ఆయన బదిలీపై అనపర్తి వచ్చారు. ఇప్పటివరకు పనిచేసిన హిమమహేశ్వరి సామర్లకోట బదిలీ అయ్యారు.

ఘనంగా అమ్మవారి ఊరేగింపు

గోకవరం: వీరభద్రుని గద్దెలో కొలువై ఉన్న దుర్గాదేవి అమ్మవారి ఊరేగింపు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గ్రామస్థుల సహకారంతో బుధవారం సాయంత్రం జరిగింది. అమ్మవారిని రథంపై ఉంచి గరగ నృత్యాలు, కోలాటం, నవ దుర్గ వేషధారణలు, తీన్మార్ డప్పులతో ప్రధాన రహదారితో పాటు పలు వీధుల గుండా ఈ ఊరేగింపు సాగింది.

ప్రజల తరఫున పోరాటానికి సిద్ధం

నవీన్ దృష్టికి గ్రామస్థుల సమస్యలు



జ్యోతుల నవీన్‌కు సమస్యలను వివరిస్తున్న గుమ్మళ్లదొడ్డి గ్రామస్థులు

గోకవరం, న్యూస్‌టుడే: ఇథనల్ పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యం వలన అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని గుమ్మళ్లదొడ్డి గ్రామస్థులు తెదేపా కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ వద్ద వాపోయారు. బుధవారం ఆయన గుమ్మళ్లదొడ్డి గ్రామాన్ని స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. నవీన్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం వలనే ఈ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. పరిశ్రమ వల్లనే అనర్థాలు తలెత్తితే ప్రజల తరఫున పోరాటం చేస్తామన్నారు. త్వరలోనే పరిశ్రమ యాజమాన్యంతో సమావేశమవుదామన్నారు.

పరిశ్రమ కాలుష్యమే కారణమా?



చిన్నారి ఒంటిపై దద్దుర్లు

పరిశ్రమతో ఇప్పటి వరకు శ్వాసకోస సమస్యలే ఉండేవని తాజాగా పది నెలల బాలుడి ఒంటిపై దద్దుర్లు కనిపించాయి. దీంతో చిన్నారిని తల్లిదండ్రులు రాజమహేంద్రవరం ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చూపించారు. గాలి, నీటి తేడాతో దద్దుర్లు వస్తాయని వైద్యులు చెప్పినట్లు బాలుడి తల్లిదండ్రులు పేర్కొన్నారు.

అధ్యాపక ఖాళీ భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

రంగంపేట: రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జంతు శాస్త్ర అధ్యాపకుని ఖాళీ భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.హేమ తెలిపారు. జంతుశాస్త్రంలో 50శాతం మార్కులు పైబడి పీజీ చేసిన వారు ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 21వ తేదీ 11గంటలకు ముఖాముఖి నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు.

రాష్ట్రాన్ని ప్రగతి పథంలో తీసుకువెళ్తున్నాం: గోరంట్ల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

కాతేరు(కడియం), బొమ్మూరు: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు ప్రగతిపథంలో ముందుకు సాగుతున్నామని గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. కాతేరు, కోలమూరు గ్రామాల్లో బుధవారం జరిగిన పల్లెపండుగ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కూటమి రాకతో గ్రామాల్లో నూతన వసంతం వచ్చిందన్నారు. కాతేరులో రూ.కోటి అయిదు లక్షలతో, కోలమూరులో రూ.రెండుకోట్ల అయిదు లక్షలతోనూ పలు సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ పనులు సంక్రాంతి లోపు పూర్తి చేసేందుకు కార్యాచరణ చేశామన్నారు. తెదేపా హయాంలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా కోలమూరు, కాతేరుకు రూ.21 కోట్లు నిధులు మంజూరు చేస్తే వైకాపా వాటిని రద్దు చేసిందని దుయ్యబట్టారు. గ్రామీణ తెదేపా అధ్యక్షుడు మత్శేటి ప్రసాద్, నున్నా కృష్ణ, దండ మూడి ప్రసాద్, పి.ఈశ్వరుడు, గంగిన జాహ్నవి, ప్రత్యేకాధికారి జ్యోతి, ఎంపీడీవో శ్రీనివాసరావు, పీడీ సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండగతో గ్రామాల అభివృద్ధి



అచ్యుతాపురత్రయంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి, న్యూస్‌టుడే: పల్లె పండగతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం పెదపూడి మండలంలో జి.మామిడాడ, గండ్రేడు, అచ్యుతాపురత్రయం, రామేశ్వరం గ్రామాల్లో పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా పలు సిమెంట్ రోడ్లకు భూమి పూజలు నిర్వహించారు. గ్రామాల సంపూర్ణ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కూటమి నేతలు జుత్తుక కృష్ణ, కొటికలపూడి సత్తిబాబు, గంటా రాజు, ఆరుమిల్లి సత్యభారతి ప్రసాద్, జుత్తుక సూర్యకుమరి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన డీవైఈవో

గోకవరం: రంపయర్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలను డీవైఈవో నారాయణ బుధవారం సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంతో పాటు దస్త్రాలను పరిశీలించారు. అక్కడ విద్యాబోధన జరుగుతున్న తీరును ఆయన పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఇదిలా ఉంటే పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు విద్యార్థులతో అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని పలువురు డీవైఈవో దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. దీనిపై ఎంఈవోతో పాటు డీవైఈవోను అడగగా ఏ విధమైన వివరాలను వెల్లడించలేదు.

వరద ముంపులోనే ఇసుక రీచ్‌లు



వంగలపూడి రేవును పరిశీలిస్తున్న అధికారులు, నిర్వాహకులు

సీతానగరం, న్యూస్‌టుడే: టెండర్ల విధానంలో కేటాయించిన ఓపెన్ రీచ్‌ల్లో సీతానగరం మండలంలోని వంగలపూడి-1, 2, కాటవరంలో ఇసుక తవ్వకాలు బుధవారం నుంచి ప్రారంభం కాలేదు. గోదావరి ముంపులోనే రేవులు అస్తవ్యస్తంగా ఉండడం, నదీ గర్భంలో వేసిన రోడ్లు కొట్టుకుపోవడంతో తవ్వకాలు నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదని అధికారులకు రేవుల నిర్వాహకులు వివరించినట్లు తెలిసింది. వంగలపూడిలో రెండు ఓపెన్ రీచ్‌ల్లోనే తవ్వకాలు చేసే చోటనే వరద ముంపు ఉంది. అందులో ఒకరేవు 75 శాతం తవ్వకాలకు అనుకూలంగా ఉండడం, రెండో రేవు పూర్తిగా వరద ముంపులోనే ఉంది. అనుకూలంగా ఉన్న రేవులో తవ్వకాలు రెండు మూడురోజుల్లో మొదలుపెట్టాలని అధికారులు సూచించారు. కాటవరంలో అయితే ఇప్పట్లో గోదావరి నదికి వరద నీరు తగ్గేలా లేదంటున్నారు. ఎటువంటి యంత్రాలు వినియోగించకుండా రోజుకు కనీసం 1000 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు ఓపెన్ రీచ్‌ల్లో చేయాల్సి ఉంది. బుధవారం వంగలపూడి రీచ్‌లో తవ్వకాలు చేసే పరిస్థితిని అధికారులు, రేవుల నిర్వాహకులు పరిశీలించారు. తహసీల్దార్ అంకం శ్రీనివాసు ఉన్నారు.

మేత కోసం మేక విన్యాసాలు



పచ్చని చిగుళ్లు ఆరగించేందుకు ఆరాటపడుతుంది. అందుకు ఏమాత్రం ఆసరా దొరికినా చివర వరకు వదలకుండా ప్రయత్నం చేస్తుంది. ఇటువంటి చిత్రమే గోకవరంలో 'న్యూస్‌టుడే' కెమెరాకు చిక్కింది. పంచాయతీ కార్యాలయం సమీపంలో చెట్టుకు ఉన్న పచ్చని చిగురుపై మేక కన్ను పడింది. ఎలాగైనా అందుకోవాలని ప్రయత్నాలు చేసింది. చివరకు అదే చెట్టు కింద నీడ కోసం నిలిపిన ద్విచక్రవాహనాన్ని ఆసరాగా చేసుకుంది. సునాయసంగానే ఆ బైక్ పైకి ఎక్కి చెట్టు చిగుళ్లను ఆరగించింది. అటుగా వెళ్లే వారు ఎంతో ఆసక్తితో ఈ సన్నివేశాన్ని తిలకించారు.

– న్యూస్‌టుడే, గోకవరం

మొక్కుబడిగా పొలం పిలుస్తోంది



ఎస్.టి.రాజాపురంలో రైతులతో వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

రంగంపేట: 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం రంగంపేట మండలంలో మొక్కుబడిగా తయారైంది. వ్యవసాయ సంబంధిత శాఖలకు చెందిన అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరుకావాల్సి ఉండగా మండలస్థాయి అధికారి ఒక్కరే దీనిని నిర్వహిస్తున్నారు. బుధవారం మర్రిపూడి, ఎస్.టి.రాజాపురంలలో ఈ కార్యక్రమం జరుగగా మండల వ్యవసాయాధికారి కె.శ్రీనివాసరావు మాత్రమే హాజరై రైతులకు సూచనలు ఇచ్చారు.

బిక్కవోలు: రైతులు కోరుకుంటున్న వ్యక్తిగత విడి పనిముట్లు ప్రభుత్వం త్వరలో అందివ్వనుందని, రబీ నుంచి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు తెలిపారు. బిక్కవోలు ఆర్.ఎస్.పేట వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అనపర్తి ఏడీఏ డీవీ కృష్ణ, రాజమహేంద్రవరం నుంచి వ్యవసాయ అధికారులు జయరామలక్ష్మి, జి.వాణి, శామ్యూల్ జాన్ పాల్గొన్నారు.

ప్రజలకు పారదర్శక పాలన అందించాలి



సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని, పారదర్శక పాలన అందించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. బుధవారం జరిగిన కోరుకొండ మండల ప్రజాపరిషత్తు సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. సమావేశాలకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు మాత్రమే రావాలన్నారు. ఇక నుంచి సమావేశాలకు రాని అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధిహామీ పథకం, విద్యా, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ తదితర సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ వుల్లి వీరవెంకట సత్యసూర్య కుమారి, జడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, వుల్లి బుజ్జిబాబు, ఎంపీడీవో అశోక్‌కుమార్, తహసీల్దారు సుస్వాగతం, ఏడీఏ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

జీజీయూలో చిత్రబృందం



విద్యార్థులతో మాట్లాడుతున్న సుహాస్

రాజానగరం, న్యూస్‌టుడే: గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)లో జనకే అయితే గనక సినిమా కథానాయకుడు సుహాస్, కథానాయిక సంకీర్తన, దర్శకుడు సాకేత్ తదితరులు బుధవారం సందడి చేశారు. ఈ సందర్భంగా సుహాస్, సంకీర్తన మాట్లాడుతూ ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తోందన్నారు. కళాశాలను సందర్శించిన చిత్రబృందంతో సెల్ఫీలు తీసుకునేందుకు విద్యార్థులు పోటీ పడ్డారు.

కొత్త దుకాణాల్లో.. ఇంకా పాత వాసనే!

మద్యం ప్రియుల నిరాశ

సీతానగరం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో ఇచ్చిన మద్యం సీసాలనే కూటమి ప్రభుత్వం ప్రారంభం రోజున పాత ధరలకే అమ్మడంపై మద్యం ప్రియులు వాపోతున్నారు. మద్యం దుకాణాలు ప్రారంభోత్సవం రోజున బుధవారం ఉదయం నుంచే మందుబాబులు బారులు తీరారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పాత ప్రక్రియను రద్దుచేసి కొత్త మద్యం విధానంలో నిఖార్సైన బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చేలా ప్రైవేటు వ్యాపారులకు దుకాణాలను కేటాయించింది. 180 ఎంఎల్ మద్యం రూ.99లకే దొరుకుతుందని మద్యం ప్రియులు పలుదుకాణాల వద్ద ప్రారంభోత్సవం రోజున ఎగబడ్డారు. తీరా వెళ్లి చూస్తే జగన్ ప్రభుత్వంలో అమ్మిన బ్రాండ్లనే తీసుకొచ్చి రూ.150 నుంచి రూ.220 చొప్పున అమ్మడంపై పండగనాడు కూడా ఇంకా పాత వాసన పోలేదంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం డిపోల్లో ఇప్పటికీ పాత స్టాకు ఉండడం, కొత్త బ్రాండ్లు కూడా రావడంతో ఇలా జరిగిందని.. ఒకటి రెండురోజుల్లోనే పాత స్టాకు అయిపోతోందని కోరుకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాసా బాలాజీ 'న్యూస్‌టుడే'కి తెలిపారు. సీతానగరం మండలంలో రెండు మద్యం దుకాణాలకు లైసెన్సులు ఇచ్చామని మరో దుకాణం కల్లు గీత కార్మికులకు కేటాయించడం జరుగుతుందన్నారు. డిజిటల్ లావాదేవీలతోపాటు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయాలు చేసేలా ఎక్సైజ్‌శాఖ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుందన్నారు.

ఆరోగ్య నియమాలను పాటిస్తే మేలు

రాజానగరం: ఆరోగ్య నియమాలను పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని గైట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.కె.వల్లీమాధవి అన్నారు. గైట్ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.వల్లీమాధవి మాట్లాడుతూ ప్రపంచ ఆహార దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. హెచ్‌బీఎస్ హెచ్‌ఓడీ డా.ఎం.సావిత్రి పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

రాజానగరం: కానవరం గ్రామానికి చెందిన 17 ఏళ్ల బొర్రా త్రినాథ్ అలియాస్ పండు అదే గ్రామంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 15వ తేదీ రాత్రి ఇంట్లో పడుకున్నాడు. ఉదయం కుటుంబ సభ్యులు లేచి చూడగా కనిపించలేదు. అన్నిచోట్లా వెతికినా ఫలితం లేకపోవడంతో అతని చిన్నాన్న బొర్రా సీతారాం రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. అదృశ్యమైన త్రినాథ్ హైదరాబాదు చేరుకుని స్నేహితుడిని కలిసినట్టు సమాచారం.

చంటియ్య మృతికి నివాళి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నర్సరీ రైతులు

కడియం: నర్సరీ రంగంలో ఓ పెద్దదిక్కును కోల్పోయామని మండల తెదేపా అధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్ కొనియాడారు. కడియపులంకలో ఇటీవల అనారోగ్య కారణాలతో మృతిచెందిన పుల్లా సత్యనారాయణ(చంటియ్య) కుటుంబాన్ని ఆయనతో పాటు పలువురు నర్సరీ రైతులు బుధవారం పరామర్శించారు. ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. గిరజాల వీర్రాజు, నాగేశ్వరరావు, పాటంశెట్టి రాంజీ, బత్తుల రాము, రేమళ్ల ప్రసాద్, జానకిరామయ్య ఉన్నారు.

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

రాజానగరం: కేంద్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికి అమలు చేస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ ఎన్.వి.వి.ఎస్.మూర్తి అన్నారు. రాజానగరంలోని ఐకేపీ కార్యాలయంలో బుధవారం మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. మహిళా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, పరిశ్రమల స్థాపనలకు బ్యాంకుల నుంచి లభించే రుణాలు వివరించారు. శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కడియం: పౌష్టికాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ సూచించారు. వీరవరంలో ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి ఆధ్వర్యంలో బుధవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. సర్పంచి బత్తుల నళినిజయంతి, రాము, ఉపసర్పంచి దొంతంశెట్టి చినవీరభద్రయ్య, ఏసీడీపీవో కనకవల్లి, పలువురు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అపార సదుపాయాలు



రాజానగరం, న్యూస్‌టుడే: దేశంలో ప్రతి పౌరుడికీ ఆధార్‌కార్డు ఉన్నట్టే ప్రతి విద్యార్థికి 12 అంకెల జీవితకాల గుర్తింపు వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తుంది. ఇందులో భాగంగా ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) కార్డును రూపొందిస్తుంది. విద్యార్థుల విద్యాప్రగతిని ఎప్పటికప్పుడు గమనిస్తూ అభ్యసనను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి సహాయపడే విధంగా జాతీయ విద్యా విధానం 2020 నిర్దేశించింది. ఈ మేరకు తగు విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు శాశ్వత విధానంలో గుర్తింపు సంఖ్యతో ప్రత్యేక కార్డును ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఆధార్ తరహాలో వన్ నేషన్..వన్ స్టూడెంట్ నినాదంతో కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు నంబరును ఇవ్వనున్నారు.

తొమ్మిది నుంచి 12 తరగతులకు..

మొదటి దఫాగా తొమ్మిది నుంచి 12 తరగతుల విద్యార్థుల వివరాలను యూ డైస్‌ప్లస్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. విద్యార్థి పేరు, జన్మించిన తేదీ, లింగం, క్యూ ఆర్ కోడ్, ఫొటో, గ్రేడ్, ఉపకార వేతనం, క్రీడల్లో సాధించిన విజయాలు, వ్యక్తిగత, విద్య సంబంధిత వివరాలు మొదలైనవి డిజిటల్ కార్డులో నమోదు చేస్తారు. విద్యార్థికి సంబంధించిన వివరాలన్నీ ఆ కార్డులో నమోదు చేయడంతో కార్డును స్కాన్ చేస్తే విద్యార్థి మొత్తం వివరాలు వెంటనే తెలుసుకునే అవకాశం ఉంది.

తల్లిదండ్రుల నుంచి అనుమతి తప్పనిసరి..

అపార్ అందించేందుకు తల్లిదండ్రుల నుంచి ముందుగా అనుమతిపత్రం తీసుకోవాలి. 18 ఏళ్లలోపు విద్యార్థులు మైనర్లు కాబట్టి వారి తల్లిదండ్రుల నుంచి సమ్మతి కోరుతూ అనుమతి పత్రాలు తీసుకుంటున్నారు.

బ్యాంక్ ఖాతాతో అనుసంధానం

విద్యార్థి బ్యాంక్ ఖాతా, డిజీలాకర్‌తో అపార్‌కార్డు అనుసంధానమై ఉంటుంది. డిజీలాకర్ ద్వారా వివరాలు నమోదు చేస్తే విద్యార్థి పేరుతో పాటు అపార్‌కార్డు కనిపిస్తుంది. తద్వారా వివిధ విద్యా సంస్థలలో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల్లో వివరాల నమోదు, ఉపకార వేతనాల మంజూరు, ఉద్యోగాల భర్తీ వంటి సందర్భాల్లో ఈ కార్డు ప్రధానపాత్ర వహిస్తుంది.

నకిలీ ధ్రువపత్రాలకు అవకాశం ఉండదు..

విద్యార్థులకు సంబంధించి వివరాలను ఒకే ఐడీలో నమోదవుతాయి. ప్రతీ విద్యార్థి అపార్ కార్డు కోసం నమోదు చేసుకోవాలి. కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న వారికి ఈ గుర్తింపు నంబరు ఇస్తారు. ఒకసారి అపార్‌నెంబరు పొందితే వివరాలన్నీ అందులో ఉంటాయి. ఐడీ స్కాన్ చేస్తే విద్యార్థి వివరాలు కనిపిస్తాయి. దీంతో నకిలీ ధ్రువపత్రాలకు అవకాశం ఉండదు.

- ఎం.రామన్నదొర, ఎంఈఓ, రాజానగరం

చక్రద్వారబంధంలో జబర్దస్త్ నటుల సందడి



లడ్డూ పాటదారులతో వేదికపై జబర్దస్త్ నటులు

చక్రద్వారబంధం (రాజానగరం), న్యూస్‌టుడే: చక్రద్వారబంధంలోని దేవీచౌక్ వద్ద నిర్వహిస్తున్న 32వ దేవీనవరాత్రి వార్షికోత్సవాలలో భాగంగా 13వ రోజైన బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈటీవీ జబర్దస్త్ నటులు పవన్, రాజమౌళి, శాంతిస్వరూప్ సందడి చేశారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గంబూసియా చేపలు విడుదల



శ్రీకృష్ణపట్నం చెరువులో చేపలను వదులుతున్న సర్పంచి శ్రీరామమూర్తి, వైద్యాధికారి

శ్రీకృష్ణపట్నం (రాజానగరం): పాలచర్ల పీహెచ్‌సీ పరిధిలో గల శ్రీరాంపురం, శ్రీకృష్ణపట్నం, రాధేయపాలెం, గాడాల గ్రామాల్లో గల చెరువులలో దోమల నివారణకు గంబూసియా చేపలను కలిపారు. శ్రీకృష్ణపట్నం సర్పంచి కిమ్మిడి శ్రీరామమూర్తి మాట్లాడుతూ దోమల నివారణ కోసం కూటమి ప్రభుత్వం ప్రజా ప్రయోజనకరమైన, ఆరోగ్యకరమైన పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి బెనడిక్ట్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ అలవరుచుకోవాలి

నల్లజర్ల, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ అలవరుచుకోవాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ (అమరావతి) సభ్యుడు జంగం రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం అమరావతి నుంచి రాజమహేంద్రవరం వెళ్తుండగా మార్గమధ్యలోని అనంతపల్లి జిల్లా ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. 9, 10 తరగతుల విద్యార్థులకు బాలల హక్కులు, విద్య వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. సామాజిక మాధ్యమాలను సద్వినియోగపరచుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, దుర్వినియోగపరచుకోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాన్ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఘనంగా దుర్గాదేవి ఊరేగింపు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భాగంగా వెలగదుర్రులో కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దుర్గాదేవి ఊరేగింపును బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన పూల వాహనం, చిన్నారుల వేషధారణ అందరినీ ఆకట్టుకున్నాయి. పరిసర గ్రామాల భక్తులు ఉత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చారు.



సీతారామ లక్ష్మణ వేషధారణలో చిన్నారులు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, అచ్చిబాబు

నిధులు వృథా కాకూడదు

తాళ్లపూడి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను పంచాయతీలే వినియోగించుకునే వెలుసుబాటును కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. తాళ్లపూడి మండలంలోని మలకపల్లిలో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీజిల్, పెట్రోలు బంక్‌ను తెదేపా సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు, ఎమ్మెల్యే కలిసి బుధవారం ప్రారంభించారు. అచ్చిబాబుకు కూటమి నాయకులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రూ.30 లక్షల సీసీ రహదారుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను వృథా చేస్తే ఇబ్బందులు వస్తాయని, ప్రజల అవసరాల మేరకు వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమీ నాయకులు మద్దిపాటి ప్రకాశం, రామారావు, సుబ్బారాయచౌదరి, రాపాక రాజేశ్వరి, టీవీ రామారావు, జీవీ ప్రసాద్, మద్దిపట్ల శివరామకృష్ణ, గంటా కృష్ణ, వెంకట్రావు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ఆదుకుంటాం

నల్లజర్ల, న్యూస్‌టుడే: ఋషి సేవా సంస్థ ద్వారా పేద విద్యార్థులతో పాటు వృద్ధులను ఆదుకుంటామని ఆ సంస్థ ఛైర్మన్ చిక్కా సత్యనారాయణ అన్నారు. బుధవారం ప్రకాశరావుపాలెంలో ఆ సేవా సంస్థ కార్యాలయంతోపాటు ఫంక్షన్ హాలును ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను పుట్టిన గ్రామంలో ఇలాంటి సేవా సంస్థలు ఏర్పాటు చేయడం ఆనందకరమన్నారు. సత్యనారాయణ దంపతులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచి జాన్ విక్టర్‌బాబు, ఉప సర్పంచి యుద్ధనపూడి బ్రహ్మారాజు, చిక్కా సోమేశ్వరరావు, సుంకవల్లి రామకృష్ణ, నూకెళ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వెంకటరాజును సత్కరిస్తున్న సత్యనారాయణ దంపతులు

ఆర్థిక సాయం అందజేత

నల్లజర్ల, గోపాలపురం: ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు కూలిపోయి ఇబ్బందులు పడుతున్న బాధితులకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు బుధవారం ఆర్థిక సాయం అందచేశారు. గోపాలపురం గ్రామానికి చెందిన కానుబోయిన పోసిబాబుకు నల్లజర్ల తెదేపా కార్యాలయంలో రూ.10 వేలు నగదును అందించారు. కొద్ది రోజుల్లో కొత్త గృహ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తాడేపల్లి ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.

వసతుల కొరత..

తాళ్లపూడి జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో స్థానికంగా ఉన్న ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతుల విద్యార్థులను విలీనం చేశారు. ఈ ఉన్నత పాఠశాలలో అదనపు భవనం ఇంకా అందుబాటులోకి రాలేదు. ఈ విద్యార్థులు రావడంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. విలీనం జరిగిన ప్రాథమిక పాఠశాలలో ఫర్నిచర్ తదితర సామగ్రి వృథాగా ఉంది. వేగేశ్వరపురంలోని రెండు ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లోకి విలీనం చేశారు. ఇక్కడా భవనాలు వృథాగా మారాయి. ఇలా విలీనం జరిగిన ప్రతి పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ నిర్ణయం మేరకు పాఠశాలల నిర్వహణ చేపడతామని, ఇంకా వివిధకాలు రావాల్సి ఉందని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.

అక్షరాలు దిద్దే బడులకు పూర్వవైభవం..!

• విలీనం జీవో రద్దుపై సర్వే

తాళ్లపూడి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం చిన్నారులకు అక్షరాలు దిద్దే పాఠశాలలను దూరం చేసింది. నూతన విద్యా విధానం పేరుతో వారి భవిష్యత్తుకు పునాది అయిన ప్రాథమిక పాఠశాల వ్యవస్థను అనాలోచిత నిర్ణయాలతో విలీనం అంటూ నిర్వీర్యం చేసింది. దీంతో కొన్నిచోట్ల ఈ పాఠశాలలు మూతపడ్డాయి. మరికొన్ని చోట్ల దూరంగా వెళ్లి చదువుకోలేక పిల్లలు విద్యకు దూరమయ్యారు. ప్రాథమిక విద్యను దెబ్బతీసే విలీన జీవోను కూటమి ప్రభుత్వం రద్దు చేసేందుకు అందరి అభిప్రాయాలను సేకరిస్తూ సర్వే చేపట్టింది. దీంతో ప్రాథమిక విద్య గాడిన పడుతోందని, ఈ పాఠశాలలకు పూర్వవైభవం రానుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మండలం	విలీనం చేసిన పాఠశాలలు
తాళ్లపూడి	8
చాగల్లు	7
కొవ్వూరు	10
గోపాలపురం	3
దేవరపల్లి	5
నల్లజర్ల	6

• కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో సుమారు 270 ప్రభుత్వ పాఠశాలలు ఉంటే వాటి పరిధిలో 39 ప్రాథమిక పాఠశాలలను జీవో -117 ప్రకారం విలీనం చేశారు. ఈ నూతన విద్యావిధానం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లోకి విలీనం చేయడం జరిగింది. వందలాది విద్యార్థులు మరొక చోటికి వెళ్లారు. అయితే అవన్నీ కి.మీ లోపు పరిధిలోవేనని చెబుతున్నప్పటికీ విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే క్రమంలో ట్రాఫిక్, రోడ్డు దాటాల్సి రావడంతో వారి తల్లిదండ్రులు భయపడ్డారు. విలీనం చేసిన పాఠశాలలో గదుల కొరత కారణంగా ఇరుకుగా ఉందని, సరైన ఫర్నిచర్ లేక నేలపైనే కూర్చోబెట్టారని తల్లిదండ్రులు గగ్గోలు పెట్టారు. కొంత మంది తల్లిదండ్రులు దగ్గరలోని ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించారు. ప్రస్తుతం ఈ విలీన జీవో రద్దుకు సంబంధించి ప్రత్యేక యాప్ ద్వారా అభిప్రాయాలను సేకరిస్తున్నారు. వచ్చే ఏడాది నుంచైనా సమీపంలోని పాఠశాలలోని 3, 4, 5 తరగతులకు తమ చిన్నారులను పంపవచ్చుని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వేగేశ్వరపురంలో నిరుపయోగంగా భవనాలు

కూటమితో అభివృద్ధి పరుగులు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: తెదేపా పూర్వ వైభవంతో అభివృద్ధి పరుగులు తీస్తోందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు అన్నారు. నిడదవోలు నియోజకవర్గ స్థాయి తెదేపా విస్తృత స్థాయి సమావేశాన్ని వేలివెన్నులో ఆయన ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పరిశీలకుడు పామర్తి సుబ్రహ్మణ్యం, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధుల నిర్మూలనకు కృషి

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యంతో పాటు, వ్యాధుల నిర్మూళనకు కృషి చేస్తున్నట్లు దొమ్మేరు పంచాయతీ సర్పంచి తానేటి కుమారి పేర్కొన్నారు. దొమ్మేరు గ్రామంలో బుధవారం డ్రెయినేజీలలో గంబూషియా చేపపిల్లలను ఆమె అధికారులతో కలిసి వదిలారు. ఈ చేప పిల్లలు దోమల లార్వాలను తినడంతో వాటి వ్యాప్తి నిర్మూలించే అవకాశం ఉందన్నారు. దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యులు దివ్య తదితరులు పాల్గొన్నారు.

రతన్‌టాటా మరణం తీరని లోటు

దేవరపల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లి మండలం దుద్దుకూరులో కూటమి నాయకులు రతన్ టాటాకి నివాళులర్పించారు. బుధవారం స్థానిక సెంటర్‌లో ఆయన చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి పూలమాల వేసి మౌనం పాటించారు. టాటా మృతి దేశానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో సుబ్బారావు, శ్రీనివాస్, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాలు వద్దు

నిడదవోలు, న్యూస్‌టుడే: నివాసాలు, ఆసుపత్రి, చర్చి, మసీదుల వద్ద నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వవద్దని సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు అన్నారు. మద్యం దుకాణాల ఏర్పాటుకు వ్యతిరేకంగా బుధవారం ధర్నా నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ గతంలో బస్టాండ్‌కూడలిలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ప్రజా ఆందోళనతో దుకాణాన్ని వేరే ప్రాంతానికి తరలించారన్నారు. కార్యక్రమంలో జహంగీర్, బబ్బులు, జాకీర్, గణప్తష్, సురేష్, ప్రభాకర్, విజయ్‌కుమార తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు



బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న రితేష్‌కుమార్

బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ప్రారంభం

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు పట్టణంలో బ్యాంక్ ఆఫ్ బరోడా 51వ శాఖను బరోడా బ్యాంక్ జనరల్ మేనేజర్ రితేష్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. రితేష్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో బ్యాంక్ ఆఫ్ బరోడా 51 శాఖలు ఉన్నాయని, వాటి ద్వారా మొత్తం రూ.8 వేల కోట్ల వ్యాపారం చేస్తున్నామని తెలిపారు. వివిధ రంగాల్లో అధిక రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీజీఎం ఎంవీఎస్ సుధాకర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్.రవీంద్రనాథ్ ఠాగూర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఏవీ భాస్కరం, నిడదవోలు బ్రాంచి మేనేజర్ కె.ప్రియబిందు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన

నల్లజర్ల, న్యూస్‌టుడే: కృషి విజ్ఞాన కేంద్రం (వెంకటరామన్నగూడెం) ఆధ్వర్యంలో మండలంలోని చీపురుగూడెం, పోతవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శేషకిరణ్, పెదబాబు రైతులకు ఆయిల్‌ఫాం, కొబ్బరి, జీడిమామిడి సాగులో సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. తెల్లదోమ నివారణకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయిల్‌ఫాం విస్తరణ పథకం ద్వారా ఇచ్చే రాయితీలను, డ్రిప్, స్ప్రింకర్ రాయితీలు, వివిధ రకాల పథకాలను ఉద్యాన శాఖాధికారిణి బబిత తెలిపారు. తుపాను కారణంగా వరి రైతులు కోతలను వాయిదా వేసుకోవాలని, కోత అయిపోతే ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించి నిల్వ చేసుకోవాలని డీఆర్‌సీ ఏవో వెంకన్నబాబు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కమల్‌రాజు, ఏఈవో పుష్పలత, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త శేషకిరణ్

ట్రేడింగ్ పేరుతో సైబర్ వల

• రూ.28.30 లక్షలు దోచేసిన వైనం

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఇన్‌స్టాగ్రామ్‌లోని మోసపూరిత యాప్ ద్వారా రూ.28.30 లక్షలను ఓ కాంట్రాక్టు లెక్చరర్ నుంచి మోసం చేసి దోచేసిన సంఘటనపై కొవ్వూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ పి.విశ్వం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన జూనియర్ కాంట్రాక్ట్ లెక్చరర్ కెవి. ద్వారకా శ్రీనివాస్ స్టాక్ మార్కెట్‌లో షేర్స్ కొనుగోలు చేస్తుంటారు. అయితే ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక యాప్ ద్వారా అధిక మొత్తం ఆదాయం వచ్చేలా ఆశ చూపిన నేరగాళ్లు.. మోతీలాల్ ఆశ్వాల్ ఇనిస్టిట్యూషనల్ అకౌంట్ యాప్‌నకు కస్టమర్ కేర్ సూచనల మేరకు శ్రీనివాస్‌తో నాలుగు ఖాతాలకు విడతలవారీగా రూ.28.30లక్షలు జమ చేయించారు. తరువాత శ్రీనివాస్ తన షేర్స్‌లోని ఖాతాలో సొమ్ము తీసుకునేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. శ్రీనివాస్ షేర్స్‌లోకి నగదు జమ కాకపోవడంతో మోతీలాల్ ఆశ్వాల్ ట్రేడింగ్ కంపెనీ ప్రతినిధులను సంప్రదించగా.. వారి నుంచి థర్డ్ పార్టీ ఖాతాలకు సొమ్ము పంపించడం ఉండదన్నారు. అంతేకాక ఇన్‌స్టాగ్రామ్ యాప్‌తో తమకు సంబంధం లేదని చెప్పడంతో శ్రీనివాస్ మంగళవారం పట్టణ పోలీసులను ఆశ్రయించారు. శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విశ్వం తెలిపారు.

నదుల ఆరాధన సంస్కృతిలో భాగం

• నవంబరు 4న తితిదే ఆధ్వర్యంలో గోదావరికి మహాహారతి • దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి ఆనంద తీర్థాచార్యులు

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: నదీమతల్లుల ఆరాధన భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి పగడాల ఆనంద తీర్థాచార్యులు అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రాణి సుస్మిత ఆధ్వర్యంలో తితిదే నిర్వహించే గోదావరి మహాహారతి నిర్వహణపై పలు శాఖల అధికారులతో, తితిదే ప్రాజెక్టు అధికారులతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ ప్రతి ఏడాది గోష్పద క్షేత్రంలో నిర్వహించే మహాహారతి ఈ ఏడాది నవంబరు 4న, సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. హారతి రోజున స్వామివారి ఉత్సవ విగ్రహాలు కొవ్వూరు గోష్పద క్షేత్రానికి చేరుకుంటాయన్నారు. భక్తులు సుమారు పదివేలకు పైగా వచ్చే అవకాశం ఉండడంతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి పగడాల ఆనంద తీర్థాచార్యులు మాట్లాడుతూ జీవకోటికి ప్రాధాన్యమైన, పవిత్ర గోదావరి మాతకు అందించే ఆత్మీయ హారతి కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు. భజన బృంద గానాలు, అనంతరం వెంకటేశ్వరస్వామి దివ్య కల్యాణమహోత్సవం నిర్వహింస్తారన్నారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో రాణి సుస్మిత, చిత్రంలో ఆనంద తీర్థాచార్యులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు దుద్దుకూరు విద్యార్థులు

దేవరపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని దుద్దుకూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించిన యోగా పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు స్వర్ణకుమారి బుధవారం తెలిపారు. స్థానిక పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి.జంగ్విలాబి, టి.వర్షికా పావని, షేక్ అలిషా, సీహెచ్ దేవి అండర్-17 విభాగంలో యోగా పోటీల్లో జిల్లా స్థాయిలో విజయం సాధించారన్నారు. వచ్చే నెలలో నెల్లూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు రామ్‌కుమార్, ప్రసాద్‌లను తోటి ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

గోదావరి మాతకు 229వ మాసోత్సవ మహానీరాజనం

చాగల్లు, కొవ్వూరు పట్టణం: అఖండ గోదావరి మాతకు 229వ మాసోత్సవ మహానీరాజనం బుధవారం నిర్వహించారు. గోష్పద క్షేత్రంలో నీరాజన సమితి అధ్యక్షుడు కె.కృష్ణారావు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. దీపోత్సవం, మహానీరాజన పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కొవ్వూరు పురపాలక సంఘ పరిధిలో హెడ్‌వాటర్ వర్క్స్ సాధారణ మరమ్మతులలో భాగంగా గురువారం తాగు నీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. 18వ తేదీ ఉదయం నుంచి ఈ సరఫరా యథావిధిగా కొనసాగుతుందన్నారు. ప్రజలు అందుకనుగుణంగా నీటి నిల్వలు చేసుకోవాలని సూచించారు.

చదువుకు దూరం కారాదు

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: చదువుకు దివ్యాంగులు, ఇతర విద్యార్థులు సైతం దూరం కారాదని కొవ్వూరు ఎంఈవో జె.కెంపురత్నం అన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో భవిత కేంద్ర నిర్వాహకుల పర్యవేక్షణలో అభ్యాసన వైకల్యం(డిస్లెక్సియా) అవగాహన ర్యాలీ నిర్వహించారు. దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణతో విద్యను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్ర ఉపాధ్యాయులు బి.రామచంద్రరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రామన్నపాలెంలో సెపక్‌తక్రా జిల్లా స్థాయి ఎంపికలు



ఎంపికైన క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

దేవరపల్లి: రామన్నపాలెం జడ్పీ పాఠశాలలో జిల్లా స్థాయి సెపక్‌తక్రా పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో సీనియర్ విభాగంలో బాలికలు-70, బాలురు-70 మంది పాల్గొన్నారు. బాలికలు జి.రోహిత, పి.దుర్గామధుశ్రీ, ఎం.మహాలక్ష్మీ, ఎస్‌కె.మనీసా బేగం, ఎం.లాస్య, కె.మానస బాలురలు ఎల్.గణపతి, సిహెచ్. సతీష్, కె.పవన్, టి.వంశీ, పి.సాయి, పి.సారధి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్ తెలిపారు. క్రీడాకారులు ఈ నెలలో 19, 20, 21 తేదీల్లో చిన్నాయిగూడెంలో నిర్వహించే క్యాంపులో పాల్గొంటారన్నారు. అనంతరం శ్రీకాకుళంలో 22, 23 తేదీల్లో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. వ్యాయామ ఉపాధ్యాయులను, విద్యార్థులను పలువురు అభినందించారు.

భార్యను చూడడానికి వెళ్తూ అనంత లోకాలకు



సుధీర్ (పాతచిత్రం)

గోపాలపురం: పుట్టింట్లో ఉన్న భార్యను చూడడానికి వెళ్తూ ప్రమాదశాత్తూ ద్విచక్రవాహనంపై నుంచి పడి ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం.. గోపవరం గ్రామానికి చెందిన జలపర్తి సుధీర్(30)కు రెండేళ్ల క్రితం వివాహం అయ్యింది. ఆయన సగ్గొండ చక్కెర కర్మాగారంలో పనిచేస్తున్నారు. బుధవారం కరగపాడులో ఉన్న భార్యను చూడడానికి బయలుదేరారు. మధ్యాహ్నం 2 గంటలకు రాంపాలెం వచ్చేసరికి ద్విచక్ర వాహనం జారి పడిపోగా తలకు బలమైన గాయం అవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై భార్య దుర్గశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సతీష్ తెలిపారు.

ద్విచక్ర వాహనాల అపహరణలో ఒకరి అరెస్టు

కొడకండ్ల: ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న ఒకరిని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. జనగామ జిల్లా సింగరాజుపల్లిలో ఆరు నెలల కిందట ఒకటి, ఈ నెల 12న కొడకండ్ల మండలం మొండ్రాయిలో మరో ద్విచక్రవాహనం చోరీ అయినట్లు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైందన్నారు. దర్యాప్తు చేస్తుండగా బీమోలు గ్రామానికి చెందిన గంగరాజు(31) అపహరించినట్లు నిర్ధారణ కావడంతో పట్టుకున్నామని చెప్పారు.

పిడుగుపడి గాయాలు

పెరవలి: పెరవలి మండలం ఖండవల్లిలోని ఎస్సీ ఏరియాలో కొబ్బరిచెట్టుపై బుధవారం సాయంత్రం పిడుగుపడింది. దీంతో పక్కఇంట్లో నివాసం ఉంటున్న విప్పర్తి గంగాధరరావు విద్యుదాఘాతానికి గురయ్యాడు. గాయపడిన ఆయన్ని తణుకులోని ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

తెదేపా నాయకుడి మృతి

నిడదవోలు, న్యూస్‌టుడే: పట్టణ తెదేపా సీనియర్ నాయకుడు కేదారిశెట్టి వెంకటేశ్వరరావు(71) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతికి తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త శేషారావు, పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, వినోద్, రామారావు, కోలా సత్యనారాయణ, గోవిందరాజు, రామకృష్ణ తదితరులు సంతాపం తెలిపారు.

అబ్బూరికి పరామర్శ

చాగల్లు, న్యూస్‌టుడే: మండలంలోని కలవలపల్లి గ్రామ తెదేపా నాయకులు అబ్బూరి సీతారాముడు తల్లి అన్నపూర్ణమ్మ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాన్ని కొవ్వూరు తెదేపా సీనియర్ నాయకులు పెండ్యాల అచ్చిబాబు బుధవారం నాయకులతో కలిసి పరామర్శించారు. అన్నపూర్ణమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆళ్ల హరిబాబు తదితర నాయకులు ఆయన వెంట ఉన్నారు.